# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్: (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web: www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకటరత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ ఎన్.రామతారక పరబ్రహ్మశాస్త్రి

మిస్.పి. ఇందిరాదేవి

డా॥ వి.వి.ఆర్. ప్రసాదరావు

డా॥ యమ్.స్వర్ణముఖి



Volume 31 Issue 2
No.of Pages 40
OCTOBER 2011

| | | |
|---|---|---|
| 5సం॥ల చందా | రు. | 250.00 |
| 2సం॥ల చందా | రు. | 120.00 |
| సంవత్సర చందా | రు. | 60.00 |
| విడిప్రతి వెల ..... .. | రు. | 5.00 |

బ్యాంక్ డ్రాఫ్ట్ A/C.Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరులో డ్రా చేయండి. M.O.,బ్యాంక్ డ్రాఫ్ట్ పంపవలసిన చిరునామా:

మేనేజరు
సమర్థసద్గురు మాగజైన్
శ్రీకాళీగార్డెన్స్-522508

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


| ఈ సంచికలో.... | పేజీ |
|---|---|

| భద్రవాక్యం | 2 |
| అమ్మఆశీస్సులు | 3 |
| బాబూజీ ఉవాచ | 4 |
| మాతాజీ అభిభాషణ | 6 |
| సన్నిధిలో సంభాషణ | 9 |
| శ్రీకాళీగార్డెన్స్‌లో కార్యక్రమాలు | 11 |
| శ్రీగురుదక్షిణ | 13 |
| గురు కృపాహి కేవలమ్ | 15 |
| దేవ్యుపాసనా ఫలం | 17 |
| శ్రీకృష్ణ కర్ణామృతం | 19 |
| పరిప్రశ్నేన సేవయా | 21 |
| ఓం శివాయ గురవే నమః | 22 |
| హనుమంతునికి అమనస్కఉపదేశం | 24 |
| బాబూజీ రాజయోగి | 26 |
| భగవత్సాక్షాత్కారము | 29 |
| శ్రీకృష్ణాష్టమి వేడుకలలో శ్రీమాతాజీ అనుగ్రహభాషణ | 29 |
| సమర్థ సద్గురు నాధుని దివ్యచరిత్ర | 31 |
| మౌనధ్యాన శిబిరం | 33 |
| సద్గురువే భగవంతుడు | 35 |
| అమెరికాలో మాతాజీ బోధ | 36 |
| శ్యామసుందరా! ఒక్కసారి! | 38 |

# భద్రవాక్యం

-పరాశర ప్రసాద్

ప్రమాదో బ్రహ్మ నిష్ఠాయాం న కర్తవ్యకదాచన ।
ప్రమాదో మృత్యురిత్యాహ భగవాన్ బ్రహ్మణః సుతః ॥
(వివేక చూడామణి)

బ్రహ్మ విచారణలో మరపు, అజాగ్రత్త అనేవి పనికిరావు. మరపు అనేది మృత్యువు. బ్రహ్మానుభవానికి చేసే ప్రయత్నమే బ్రహ్మ నిష్ఠ.

ఏమరుపాటు అనేది మాయ ప్రవేశించటానికి అవకాశం. దాని ద్వారా మోహం, మోహం ద్వారా అహంకారం తద్వారా బంధనకి దారి తీస్తుంది. సద్గురుదేవులు భక్తులను హెచ్చరిస్తూ నీటి పైన వ్యాపించి ఉన్న నాచుని ప్రక్కకి తొలగించినప్పటికి అది వెంటనే నీటిపైన ఎలా వ్యాప్తి చెందుతుందో అలాగే మాయ కూడ క్షణకాలం మరపులో ఉన్నవాడెంతటివాడైనా భ్రమలో పడక తప్పదు అనేవారు.

అజాగ్రత్త వలన చేజారిన బంతి మెట్లమీద దొర్లుకుంటూ నీకు అందకుండా పోతుంది కదా! మనస్సు ఒక్క క్షణం స్మరణ మరచిందంటే విషయాధీశం కాక తప్పదు కదా! విషయాలను చవి చూసిన మనస్సుని విషయ సంకల్పాలకు దూరం చేయటం సాధకునికి కష్ట సాధ్యమే. రోగగ్రస్థుడు అపథ్యములైన వస్తువులను విసర్జించక తప్పదు కదా!

వివేకం గల సాధకునకు సమాధి స్థితి సంప్రాప్తించినా అజాగ్రత్త పనికిరాదని మహాత్ములు ఘోషిస్తున్నారు. అందువలన "బ్రహ్మజ్ఞాని సదా సదా జాగరూపకుడు" అని శ్రీసద్గురుదేవులు హెచ్చరించారు.

**పరాశర ప్రసాద్**
**గౌరవ సంపాదకులు**

# అమ్మ ఆశీస్సులు

**సర్వశక్తి మయీ సర్వ మంగళా సద్గతి ప్రదా ।**
**సర్వేశ్వరీ సర్వమయీ సర్వమంత్ర స్వరూపిణీ ॥**

శ్రీజగన్మాతను గూర్చి మనకు లలితా సహస్ర నామ స్తోత్రము నందు శ్రీ సద్గురుదేవులు మనకు అమ్మ తత్త్వమును అందిస్తున్నారు. అమ్మ లలితాదేవి. ఆ పేరు లలితమైనది.

అనంత శక్తి స్వరూపిణి అమ్మ. సర్వ శక్తులకు తల్లి. శక్తిలేని పరమాణువు కూడా లేదు. సర్వమూ శక్తి మయం.

సర్వమంగళ స్వరూపిణి. సర్వ శుభములను దేవి నుండియే కలుగుతాయి. **సద్గతి ప్రదా.** సత్యమైన గతిని, జ్ఞానమును తప్పక ప్రసాదించునది.

**సర్వేశ్వరి.** సర్వ ప్రపంచమునకు ఈశ్వరి యేలికయై ఉన్నది. సర్వమును తానే యై ఉన్నది. సర్వ మంత్రములకు స్వరూపమై ఉన్నది.

ఈ శ్రీవిద్యను మన గురువులు మనని నమ్మి వాత్సల్యముతో మనకు ప్రసాదించారు. అందుకే గురుమూర్తిః, గురు ప్రియా, గురు మణ్డల రూపిణీ అన్న మహామంత్రములను ధ్యానించు కుంటున్నాము. అట్టి జగన్మాత ఒడిలోనే సర్వ జగత్తూ, మనమందరము జీవిస్తున్నాము.

**మయ్యేవ సకలం జాతం, మయి సర్వం ప్రతిష్టితం, మయి సర్వం లయం యాతి। తద్బ్రహ్మాద్వయమస్మ్యహం।** అని కైవల్యోపనిషత్తులో అందించారు.

అమ్మ నుండే పుడుతోంది. అమ్మయందే పెరుగుతోంది. అమ్మలోనే లయం చెందుతోంది. అట్టి బ్రహ్మ ఒక్కటే నేను అని నిజమైన జ్ఞానమును ప్రసాదిస్తున్న శ్రీసద్గురుదేవులు మనందరికీ అట్టి దివ్య జ్ఞానమును ప్రసాదించెదరు గాక! హరిఃఓమ్ తత్సత్.

శ్రీసద్గురుదేవుల సేవలో
మీ అమ్మ.

# బాబూజీ ఉవాచ

- వెంకట రమణ ప్రసాద్

. నిజమైన భక్తుడు భగవంతుడికి తన తను మనో ధనాలను సమర్పించుకుంటాడు. భగవంతుడు కూడా అలా సర్వ సమర్పణ చేసుకున్న భక్తుడి సర్వబాధ్యతలనూ తనవిగా స్వీకరిస్తాడు. ఈ సత్యం అనేక శాస్త్రాలలో చెప్పబడటమే కాకుండా, అనేకమంది భక్తుల జీవితాలలో అనుభవపూర్వకంగా నిరూపించబడటం సర్వజన విదితము. అది అందరిమీద వర్షించే దయావృష్టి. దానికి కులమతాలూ, ఎక్కువ తక్కువలూ అనే భేదాలు లేవు. దేశకాలాలు ఆ దయా స్రోతస్వినిని అడ్డగించనూ లేవు.



భగవంతుడి అపార కరుణా వితరణకు రామదాసు జీవితం ఒక ఉదాహరణ. దక్షిణ దేశంలో భద్రాచల ప్రాంతంలో ఒక మధ్య తరగతి కుటుంబంలో పుట్టాడు రామదాసు.

కబీరు కాశీ నివాసి. కాశీ భద్రాద్రికి కొన్ని వందలమైళ్ళ దూరంలో ఉంది. ఆ దూరాన్ని తరించి కాశీ నుంచి భద్రాచలం చేరుకోవటానికి కబీరు కాలంలో కార్లూ, రైళ్ళూ, విమానాలూ లేవు. ఒకవేళ ఉన్నా, కబీరు ఆ ప్రయాణాలు చేయగల ఆర్థిక స్తోమతు లేనివాడు. ధనవంతులు అశ్వారోహణ చేసి దూరప్రయాణాలు చేసేవారు గాని, ఒక ఫకీరు అయిన కబీరుకు అది అసాధ్యం. పల్లకీలో ప్రయాణించే వైభోగానికి అతడు నోచలేదు. అందుచేత అతడు కాశీ నుంచి కాలినడకనే భద్రాచలం చేరుకున్నాడు.

అయితే నిరంతర రామనామ సంకీర్తన ఆనంద తుందిల హృదయారవిందుడైన కబీరును చూసినవారికి కూడాఆకలిదప్పులూ, అలసటా విస్మృతికి వచ్చి మహానందానుభూతిని పొందేవారు. తన భక్తుడైన రామదాసును ఉద్ధరించటానికి ప్రభువైన శ్రీరామచంద్రుడే కబీరును భద్రాచలానికి పంపి ఉండాలి. యజమాని తన దూతకు దారిలో సర్వసౌర్యాలూ చేకూర్చటంలో ఆశ్చర్యమేముంది! అందువల్ల శ్రీరామచంద్రుడే కబీరు భద్రాచల యాత్రకు కావలసిన సర్వ సౌకర్యాలూ చేకూర్చి ఉండాలి.

అయితే, కబీరును భద్రాచలవాసులు ఎలా ఆదరించారో చూడండి.

భద్రాచలం రాళ్ళమయమైనా కబీరు పాదస్పర్శకు పులకరించింది. కాని రాళ్ళ కన్నా కఠినమైన భద్రాచల ప్రాంత పౌరుల మనస్సులకు కబీరు అనే ముసల్మాను రామనామ సంకీర్తన చెయ్యటం దుస్సహమూ, బాధాకరమూ అయింది. అతణ్ణి చూసి "మహ్మదీయుడు రామభక్తుడవటమేమిటి?" అని హిందువులు అపహాస్యం చేస్తే, మహమ్మదీయులు అసహ్యించుకున్నారు. ఇరువర్గాల వారూ అతణ్ణి రాళ్ళతో కొట్టి, అవమానించి సంతోషించారు.

రావణ కుంభకర్ణాదుల భయంకర బాణాలకు కసిగందని రామచంద్రుని పాదాలను ఆశ్రయించిన ఆధ్యాత్మిక పరాక్రమోన్నతుడైన ధీర కబీరుకు రాళ్ళ దెబ్బలు లెక్కా! అతడు యిదంతా తన ప్రారబ్ధం అనీ, యిలా తన కర్మ క్షయమౌతున్నదనీ ఆనందంగా ఆ దెబ్బలను స్వీకరించాడు. భగవంతుడి యందు ఆయనకున్న అఖండ విశ్వాసం అణుమాత్రం కూడ చలించలేదు.

రామదాసు అనే నామాన్ని సంతరించుకున్న గోపన్న తనకు కబీరు సంశ్రయం లభించినందుకు ఉప్పొంగిపోయాడు. తను జన్మ జన్మల నుండి ఆర్జిస్తూ వచ్చిన పుణ్యరాశి మూర్తిభవించి, కబీరు రూపంలో సాక్షాత్కరించి, తనను ఉద్ధరించ వచ్చిందని ఆనందపారవశ్య పారావారంలో మునిగి తేలాడు రామదాసు.

ఆ కాలంలో యీనాటి వలె కాక, కులమతాల కట్టుబాట్లు చాలా కఠినంగా ఉండేవి. రామదాసు పరమానందంతో కబీర్‌దాసు పాదలపై సాగిలపడ్డాడు అంటే కబీరును దర్శనం చేసేనాటికే రామదాసు జ్ఞాని, నిత్యానిత్య వివేకం కలిగినవాడు. రామదాసుకు తీసిపోయిందికాదు అతని భార్య. భర్తతోపాటుగా తాను కూడ కబీరు పాదాలకు నమస్కరించింది రామదాసు పత్ని. తల్లిదండ్రుల సంస్కారాలే పిల్లలకు అబ్బుతాయి గనుక **ఆత్మావై పుత్ర నామాసి** అన్నట్లు రామదాసు మరొక రూపమే ఆయన కుమారుడు. ఆ పసివాడు కూడా కబీరు పాదపద్మాలపైన వ్రాలిన భృంగంలా భాసించాడు. అలా పరమాదృష్టానికి నోచుకున్న ఆ కుటుంబం యావత్తూ కబీరుకు దాసోహమయి, అతని దగ్గర నుండి తారకనామ మహా రత్నాన్ని సంపాదించుకో గలిగారు.

-సశేషం

## మాతాజీ అభిభాషణ

(గత సంచిక తరువాయి) -జపమాల ప్రసాద

గురుస్వరూపంలో వున్న జగన్మాత ఈ సృష్టి అంతటినీ ఎంత అద్భుతంగా చేస్తున్నదో కదా! ఇన్ని కోటానుకోట్ల జీవరాసులని సృష్టిచేస్తూ, ఎవరి ముక్కు ఎలా పెట్టాలో, మూతి ఎలా పెట్టాలో... ఆహా! ఎక్కడా ఏమరుపాటనేది లేదుకదా! ఎవ్వరేనా ఈ భగవత్ సృష్టికి ప్రతిసృష్టి చేయగలరా? ఇంతటి విశ్వనాటకాన్ని జరిపిస్తున్న ఆ జగజ్జననిని ఏవిధంగా కొనియాడగలం?



**"నీపూజ చేసేము తల్లీ! కాపాడు**
**శుభకల్పవల్లీ మొరలిడిన పాలించు కరుణామయీ!**
**నీ చరణముల సేవే శాంతి కదా!॥నీ॥**

**చ॥ ఎవరెవరి నోముల కెంతెంత ఫలమో**
**ఇలలోనె తులతూచి ఇచ్చేటి తల్లీ**
**నిను కొలచి నాకొరకు నే కోరలేదే**
**నెలకొని మా ఇంట నీ వున్న చాలు ॥నీ॥**

**చ॥ ఓ దీనరక్షకి! మా కన్నతల్లీ!**
**ఏకాలమందు కాపాడుతల్లీ!**
**చిననాటి నుండియు పెంచిన తల్లీ**
**దినదినము మనసార దీవించు తల్లీ ॥నీ॥**

(అనే గీతం చక్కగా ఆలాపన చేసి శ్రీమాతాజీ తమ బోధని ఈ విధంగా కొనసాగించారు.)

మనకి సర్వస్వం ఇస్తున్న అమ్మని ఏమని కీర్తించాలి? ఆవిడని కీర్తించేంతటి వాళ్ళమా మనం? ఆవిడ క్రీగంటి చూపు మనమీద పడితే చాలు. ఏ కోరికా లేకుండా ఆశ్రయిస్తే, మనకి ఏ టైముకి ఏమి ఇవ్వాలో ఆవిడే చూసుకుంటుంది. ఫీజు అడిగిన డాక్టరుకి అడిగినంత మేరకే ఇస్తాం. 'మీఇష్టం' -అనే డాక్టరుకో... ఎంతైనా ఇస్తాం. అలాగే మనం ఇది కావాలి, అది కావాలి అంటే, అడిగినంత మేరకే ఇస్తుంది. "నీదయ చాలు అమ్మానాకు" అంటే

"నాదంతా నీదేరా" అంటుంది ఆ పిచ్చమ్మ, బంగారు తల్లి. మనని తనంత వాళ్ళుగా చేసి, "ఏమిటిరా! ఇంతవాడివి నానుంచే వచ్చావా?" అని ఆనందపడిపోతుంది. "అమ్మా!" అని మనసారా పిలిస్తే, "ఏరా నాన్నా!" అని పరుగున వస్తుంది ఆ తల్లి! ఆ పిలవడమే నేర్చుకోవాలి. ప్రపంచమనే బొమ్మలాటలో పడి అమ్మని మరచిపోతున్నాం. ఆకలేస్తే మట్టుకు అమ్మ జ్ఞాపకం వస్తుంది.

జగజ్జనని అనంత శక్తి స్వరూపిణి. చిన్న మర్రి విత్తనంలో పెద్ద మర్రిచెట్టుని దాచింది ఆవిడ! విత్తనంలో చెట్టు కనిపించకుండా ఉందా, లేదా? దీనినే "దక్షిణా మూర్తి స్తోత్రం"లో ఈ విధంగా చెప్పారు.

**"బీజస్యాంతరివాంకురో జగదిదమ్**
**ప్రాఙ్నిర్వి కల్పమ్ పునః।**
**మాయాకల్పిత దేశకాల కలనా**
**వైచిత్ర్య చిత్రీ కృతమ్।**
**మాయావీవ విజృంభయ త్యపి**
**మహాయోగీవ యు స్స్వేచ్ఛయా**
**తస్మై శ్రీ గురుమూర్తయే।నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే।....**

చిన్న మర్రి విత్తనంలో పెద్ద చెట్టుంది అంటే ముందు నమ్మం. దానిని గురించి ఊహించలేము కూడా. ఆ అనంత శక్తిని మనం తెలుసుకోలేమనే మహాత్ములయిన శ్రీఆదిశంకరభగవత్పాదుల వారు ఇట్టి సందేశాన్ని మనకిచ్చారు. దీనిని చక్కగా విచారణ చేసుకుందాము.

యః = ఎవరు, ఇదం జగత్ = ఈ ప్రపంచమును, ప్రాక్ = (సృష్టికి) పూర్వము, బీజస్య = విత్తు (విత్తనం) యొక్క, అంతః = లోపలనున్న, అంకుర ఇవ = మొలకవలె, నిర్వికల్పమ్ = అవ్యక్తముగా నున్న దానిని, పునః = మఱల, మాయావీ ఇవ = ఇంద్రజాలికుడి వలె, మాయా కల్పిత దేశకాలకలనా వైచిత్ర చిత్రీకృతమ్ = మాయ చే కల్పింపబడిన దేశకాలాది కూర్పుచే కలిగిన, చిత్ర విచిత్రములుగ రూపొందింపబడిన దానినిగ, మహాయోగీ ఇవ = మహాయోగివలె, స్వేచ్ఛయా (వర్తతే) = స్వేచ్ఛామాత్రులుగా నున్నారో, తస్మై = అట్టి, శ్రీగురుమూర్తయే = శ్రీపరమ గురుస్వరూపులగు, శ్రీ దక్షిణామూర్తయే = శ్రీదక్షిణామూర్తి స్వామివారికి, ఇదం = ఇదే, నమః = వందనము.

మనం గారడీ విద్యలు చేసే వారిని (magicians) చూస్తూ వుంటాం. ఒక ఖాళీ టోపీ తీసి బల్లమీద పెడతాడు. దానిని బోర్లించి మళ్ళీ తీసేసరికి, ఒక కోడిపెట్ట వుంటుంది! భలే బాగుంది! అని చప్పట్లు కొడతాం మనం. అలాగే, సృష్టికి పూర్వం ఈ జగత్తంతా, విత్తనంలోని చెట్టులాగా, అవ్యక్తంగా, రూపనామ రహితంగా వుంది. అటువంటి అవ్యక్తము నుండి, ఎవరయితే గారడీవాని లాగ, మాయాకల్పనచే, దేశకాలాదులచే తెలియబడు చిత్ర విచిత్రమైన ప్రపంచమును రూపొందించి, ప్రకాశింపచేసి, అయినాకూడా మహాయోగి వలె అకర్తగా స్వేచ్ఛామాత్రులై వున్నారో, అట్టి పరమ గురువులైన శ్రీదక్షిణామూర్తి వారికి నమస్కరిస్తున్నాను అని పై శ్లోకానికి అర్థం. ఇదే మాట శ్రీగీతా చార్యుడు కూడా భగవద్గీతలో చెప్పారు. **"తస్య కర్తారమ్ అపి మాం విద్ధి అకర్తారమ్ అవ్యయమ్"** అని.

కొబ్బరి కాయగా వున్నపుడు చెట్టు కనబడదు. అది మన ఊహకి కూడా అందదు. ఈ విత్తు నుండి చెట్టు ఎలా వస్తోంది అనేది మనం తెలుసుకోవాలంటే, అది తెలపడానికి మనకి సత్య గురుదేవుడే కావాలి. వారు మనలో లక్ష్యార్థమనే మంత్ర బీజాన్ని ప్రవేశపెడతారు. దానికి నిరంతర విచారణ అనే ఎరువుని, సాధన అనే నీటిని అందించి జాగ్రత్తగా చూసుకుంటే చాలు. భక్తి అనే గర్భం ధరించి, జ్ఞానమనే పుత్రుడిని కనాలి.

గర్భవతి అయిన స్త్రీకి వాంతులు రావాలి, పొట్టపెరగాలి అని చెప్పనక్కరలేదు. అదే విధంగా, విత్తనం నాటాక, వ్రేళ్ళు రావాలి, ఆకులు రావాలి అని చెప్పనవసరం లేదు. నాటిన విత్తనానికి నీరందించడమే నీవంతు. సాధన చేయడమే ఆ నీరు. తద్వారా ఈ దేశ కాలములు కలిగిన ప్రపంచంలోనే వున్నా, వాటికతీతమైన దివ్యానుభూతులను, నీ సాధనయొక్క తీవ్రతని బట్టి, గురుదేవులే ప్రసాదిస్తారు.

జగన్మాత యొక్క అనంతసృష్టి రహస్యాన్ని తెలిపేవాడు సద్గురు నాధుడు. ఇక్కడ సద్గురుదేవుడన్నా, జగన్మాత అన్నా, అనంత శక్తి అన్నా, ఆత్మ అన్నా అన్నీ ఒక్కటే. "ఈశ్వరో గురురాత్మేతి। మూర్తి భేద విభాగినే". అనంతత్వంలో రూప, నామ క్రియా భేదం లేదు. లింగభేదం లేదు.

-సశేషం

# సన్నిధిలో సంభాషణ

(గత సంచిక తరువాయి)

- పరాశర ప్రసాద్

2-6-1985

ఈ రోజు ఉదయం శ్రీబాబు భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ మీ హృదయబాబు మీ నుంచి కోరే కట్నం ఏమిటి తారకం? అని ప్రశ్నించారు. మా నుంచి మీరు ఏ రకమైన కట్నం తీసుకోరు బాబు అన్నారు తారకంగారు. శ్రీబాబు మాట్లాడుతూ మీ హృదయ బాబు మీ భోగభాగ్యాలని కాని, మీ సేవల్నికాని ఎన్నడూ కోరడు. కాని మీ నుంచి ఆశించే కట్నం మీ మనస్సు. అది సమర్పించకుండా ఏదో దక్షిణ ఇచ్చి నన్ను సంతృప్తిపరచాలని చూస్తారు మీరు. దానిని అందుకునేవారు వేరే ఉన్నారు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ మీ హృదయబాబు అనుక్షణం ఆత్మానంద స్థితిలో ఓలలాడుతూ ఉంటాడు. అది సత్యమే కాని మీ బాబు మిమ్మల్ని చూసి ఎప్పుడు ఆనందిస్తాడో తెలియజేసే సంఘటన చెబుతాను. నా చిన్నతనంలో మధురమీక్షి దేవాలయంలో ఒక మహాజ్ఞాని ఉండేవాడు. ఆయన ఎప్పుడూ ధ్యానంలో ఉండేవాడు. అర్చకులు ఆయనని రోజూ చూసేవారు. ఆయన కదిలేవాడు కాదు. ఆయనని చూసి అందరూ సోమరి అనుకున్నారు. అలా కొంతకాలం గడిచిన తరువాత ఈయన మనల్ని ధనంగాని, తినటానికిగాని ఇమ్మని అడగటంలేదు కదా! అనే సద్బుద్ధి కలిగింది. బహుశ ఈయన ఎవరైనా భక్తుడో, జ్ఞానో లేకపోతే మతిభ్రమించిన వాడో అయిఉండాలి అనుకొని ఆ దేవాలయంలోని అర్చకులు భగవంతునికి నివేదన చేసిన ప్రసాదం కాస్త ఇచ్చేవారు. ఆ ప్రసాదాన్ని తీసుకొని కదలకుండా ఉండేవాడు. పరమాత్మని ధ్యానంలో సమాధి స్థితిలో ఉండేవాడు. ఆ అర్చకులకి నెమ్మది నెమ్మదిగా ఆయన యెడల విశ్వాసం పెరిగి నమస్కరించి ప్రసాదం చేతిలో ఉంచేవారు.

కాలగమనంలో మార్పు వచ్చింది. అర్చకుడు చనిపోయాడు. అతని కుమారుడికి పెత్తనం నచ్చింది. తపస్వికి ప్రసాదం పెట్టడం మాని ప్రతిరోజూ దూషించటం మొదలు పెట్టాడు. ఇటువంటి సోమరికి ప్రసాదం పెట్టకూడదు అన్నాడు. క్రోధం పెరిగి ఇటువంటి సన్యాసులు పనిలేకుండా సోమరులలాగా దేశంలో చాలా మంది ఉన్నారు అని బిగ్గరగా అన్నాడు. తిట్టినా ఆ జ్ఞాని మారు పలుకలేదు. ఆయనది అబేధ దృష్టి. ప్రసాదం పెట్టిన తండ్రిని, దూషించిన కొడుకుని ఒకే విధంగా ప్రేమించాడు. ఇలా కొన్నిరోజులు గడిచాయి. ఆయన కదలడు, మెదలడు, క్షుద్బాధ లేదు. దానిని చూసి అర్చకులంతా ఆశ్చర్యపోయారు. సినిమాకి, లోకాభిరామాయణానికి అయితే ఏ బాధ ఉండదుకాని, అష్టోత్తర పూజగాని,

సహస్రనామ పూజగాని చేయించాలంటే ఈ కాలు మార్చుకుని ఆ కాలు మార్చుకోవాలి కదా!

భగవంతుడి గురించి ఈ ప్రారబ్ధ గ్రహచారబండి ఆలోచించ నివ్వదు. మనస్సు ఆధ్యాత్మిక విషయాలమీదకి వెళ్ళదు. కాని ఈ సన్యాసి విషయం విచిత్రంగా ఉందే! ఎంత దూషించినా మన మీద ప్రేమ వర్షిస్తున్నాడే! క్షుద్బాధ లేదు. తిట్టినా ఏమీ అనటం లేదు. ఇంతకీ నువ్వు జడమా? నేను చెప్పేది వినిపిస్తోందా? అని ఆ సన్యాసిని ప్రశ్నించాడు.

ఆయన సమాధానం చెబుతూ నాయనా! నువ్వు చెప్పేది వింటూనే ఉన్నాను. దానికి సమాధానం తగిన సమయంలో చెప్పేవాడు వేరే ఉన్నాడు. ఆయన ఉన్నాడు కాని కంటికి కనబడడు. మనం చెప్పేది వింటాడుగాని సమాధానం చెప్పడు. సమాధానం చెప్పకపోయినా జరగవలసినది ఏదో నిర్ణయిస్తాడు అని చెప్పి కూర్చో అన్నాడు.

అర్చకుడు కూర్చున్నాడు. ఎంతసేపని కూర్చుంటాడు. మళ్ళీ నిలబడ్డాడు. అర్చకుని మళ్ళీ కూర్చోమన్నాడు. అప్పుడు గ్రహించాడు అర్చకుడు చిత్తము ఏకాగ్రత అంటే ఇదేనేమో! అతని చిత్తము చలించక గాలిలేని దీపంలాగా కూర్చోగలిగాడు. ఆ సన్యాసి బోధిస్తున్నాడు మనస్సు కూర్చోమంటే ఉపాధి కూర్చుంటుంది కాని మనస్సు సంచరిస్తోంది అని చెప్పాడు. అర్చకుడు తన తప్పు తెలుసుకున్నాడు. ఈ సన్యాసి గొప్ప తపస్వి, జ్ఞాని. ఈయన మనస్సు నిరంతరం భగవంతుని యందే నిలిచే ఉంటుంది. అది చలించదు అని ఆయనకి సాష్టాంగ నమస్కారం చేసి, ఆరోజు మొదలు ప్రతిదినం భగవంతునికి నివేదన అయిన వెంటనే ఆయనకి రెండు ముద్దలు ప్రసాదం తెచ్చి ఇచ్చి నమస్కరించేవాడు. ఆ సన్యాసి మాట్లాడుతూ మీ నాన్న ప్రతిరోజూ ఒక ముద్ద ప్రసాదం ఇస్తే నువ్వు రెండు ముద్దలు ప్రసాదం ఎందుకు పెడుతున్నావు? అని ప్రశ్నించేసరికి అర్చకుడు సమాధానం చెబుతూ మీరు లేవకుండా కూర్చోగలిగినందుకు ఒక ముద్ద, చలించని మనస్సు కలిగినందుకు రెండవ ముద్ద అని సమాధానం చెప్పాడు. చూశారా! అది ఎటువంటి స్థితో! మీరంతా అటువంటి స్థితిలో ఉంటే మీకూ ఆనందమే, నాకూ ఆనందమే. ఆ స్థితిని చూసి ఆహా! జీవకోటికి పునర్జన్మ లేదుకదా! వీరంతా మోక్ష స్వరూపులు కదా! వీరి హృదయాల్లో నా రామపాదుకలు నిలిచాయి కదా! వీరికి అద్వైత దృష్టి జాతి, నీతి, కుల, గోత్ర రహిత దృష్టి కలిగింది కదా! అని ఆ భక్తులు పొందే ఆనందాన్ని చూస్తూ ఆనందాన్ని పొందుతాడు మీ హృదయబాబు. తండ్రి కన్నా భగవత్తత్వాన్ని ఎక్కువగా అర్థం చేసుకుని మోక్షాన్ని పొందాడు ఆ అర్చకుడు అన్నారు శ్రీబాబు.

-సశేషం

# శ్రీకాళీగార్డెన్స్‌లో విశేషపూజా కార్యక్రమములు

**అక్టోబర్ 2011**

3 సోమవారం శ్రీ సరస్వతీపూజ, మూలా నక్షత్రం,

4 మంగళవారం దుర్గాష్టమి. ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు,

5 బుధ మహర్నవమి.

6 గురు విజయదశమి, ఉదయం శ్రీ జగన్మాత సామూహికపూజలు, నామకరణములు, అన్నప్రాశనలు, అక్షరాభ్యాసములు రామాలయంలో జరుగుతాయి.

7 శుక్రవారం ఏకాదశి, ఏకాహం.

8 శనివారం దీక్షావిరమణ, మంత్రపూతమైన పూజాక్షతలతో శ్రీమాతాజీ భక్తులను ఆశీర్వదిస్తారు. రాత్రి 7 గం.లకు జగన్మాత నగర దర్శనోత్సవము. రాత్రి 8 గం.లకు శ్రీ సద్గురు పాదపూజ.

11 మంగళవారం పూర్ణిమ, శ్రీమాతాజీవారి 57వ జన్మదినోత్సవము, శ్రీ సద్గురు పాదపూజ,సత్సంగం, భక్త సమారాధన.

22 శనివారం శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

25 మంగళ మాస శివరాత్రి, నరక చతుర్దశి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ.

26 బుధవారం దీపావళి, ఉదయం సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. భక్త సమారాధన, రాత్రి 8 గంటలకు టపాసులు కాల్చుట.

29 శనివారం నుండి నవంబర్ 6 ఆదివారం వరకు ప్రతి రోజు ఉదయం శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి పంచామృతాలతో, నవ రసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన

30 ఆదివారం శ్రీనాగుల చవితి.

**నవంబరు 2011**

7 సోమ ద్వాదశి శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

10 గురు గురుపూర్ణిమ, శ్రీగురునానక్ జయంతి, శ్రీ సద్గురు పాద పూజ, సత్సంగం, భక్త సమారాధన, సాయంకాలం శ్రీ మహాకాళికా పరమేశ్వరీ రామలింగేశ్వరుల నగర దర్శనోత్సవం, జ్వాలాతోరణం, చాతుర్మాస్య దీక్షా విరమణ

## నవంబరు 13 ఆదివారం నుండి 21 సోమవారం వరకు శ్రీ గురుదేవుల త్రయోవింశతి వార్షిక పుణ్యారాధన మహోత్సవాలు

13 ఆది ఉదయం పంచ యజ్ఞ సహిత పుణ్యారాధన మహోత్సవ సాప్తాహ్నిక దీక్షా స్వీకరణ, పంచ యజ్ఞ ప్రారంభం. ప్రతిరోజు ఉదయం 8 గం.లకు శ్రీ రామ తారక పరబ్రహ్మ ప్రసాద్, శ్రీ వెంకటరమణ ప్రసాద్ గార్లచే శ్రీ గురుగీతా ప్రవచనము.

14వ సోమ నుండి - 20వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 4 గం.లకు సుప్రభాతం, నగర సంకీర్తన5 గం.లకు ప్రాతఃకాల ప్రార్థన, మహామంగళహారతి. 6గం.లకు బ్రహ్మశ్రీ కొండూరు రామ సుబ్రహ్మణ్యం గారిచే వేద పఠనము, ఆలయ దర్శనములు, తీర్థ ప్రసాదములు

13 - 20 వరకు మధ్యాహ్నం శ్రీసద్గురు శత సహస్ర నామార్చనము, మహామంత్ర పుష్పము, దర్బారు. తీర్థ ప్రసాద వితరణ. భక్త సమారాధన సాయంత్రం 6 గం.లకు ప్రార్థన మహా మంగళహారతి

14 - 19 వరకు ఉదయం 9 గం.లకు సత్సంగ సమావేశము, శ్రీ మాతాజీవారి అనుగ్రహభాషణ సద్గురుదేవుల దర్శనము,బోధ (వీడియో).శ్రీ బాబూజీ మహరాజ్ వాడిన వస్తువుల మ్యూజియమ్ ప్రదర్శన (అర్థగంట)

18 శుక్ర సామూహిక సద్గురు పూజలు. ఊంజల సేవ

19 శని రాత్రి 7 గం..లకు డోలోత్సవము

20 ఆది శ్రీ గురుదశమి, సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ. రాత్రి 7 గం.లకు శ్రీ సద్గురుదేవుల మహాపుణ్యారాధన.

**21** సోమ ఉషఃకాలం. 3 గం.లకు శ్రీ సద్గురుదేవులకు రుద్ర, నమక చమక సహిత మహాభిషేకము. ఉదయం శ్రీ సద్గురు పాదపూజ దీక్షావిరమణ, మహామంగళ హారతి. స్వామివారి నగరోత్సవము.

గమనిక -పెద నింద్రకొలను ఆశ్రమశాఖలో శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన, సత్సంగం, తెప్పోత్సవం.

23 బుధ మాసశివరాత్రి

30 బుధ శ్రీ సుబ్రహ్మణ్యషష్టి, శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారికి అభిషేకము, సహస్రనామార్చన.

# శ్రీగురు దక్షిణ

(గతసంచిక తరువాయి)

- సుశీలా ప్రసాద

రోజులు గడుస్తున్నాయి. గుళ్ళో స్వామికి పూలూ, పళ్ళూ తీసుకెళ్ళే జనం పెరిగారు. శివుడు నాలుగు రాటలు పాతి, తాటాకులతో చిన్న పందిర వేసి, దాని క్రింద అమ్మకం సాగించాడు. డబ్బు లెక్కలు తెలియాలి కదాని, రామశర్మ దగ్గగర చదువుకుంటున్నాడు యిప్పుడు.

"అయ్యవారూ! ఎన్ని సంబంధాలు చూసినా, అమ్మాయికి ఒక్కటీ కుదరటం లేదు. అసలు దానికి పెళ్ళి యోగం ఉందంటారా?" అని, ఒక ఆసామి వాపోయినప్పుడు, రామశర్మ "పోనీ అమ్మాయి పేరు, నక్షత్రం పైన గుళ్ళో దేవుడికి పూజలు చేద్దాం, అందువలన ఏమైనా లాభం కలుగుతుందేమో చూద్దాం" అని ధైర్యం చెప్పి, మనస్సుకి ఊరట కలిగిస్తే, అతగాడు "మీ మాటకి తిరుగుందా?" అంటూ ముందుకు సాగిపోయాడు.

మరి కాలమే కలిసివచ్చిందో, దైవానుగ్రహమే కలిగిందో, కొద్దిరోజుల లోనే ఆ ఆసామి రామశర్మ దగ్గరకి వచ్చి దండం పెట్టి, "అయ్యా! తమరు చేసిన మేలు మర్చిపోలేను. పెళ్ళి ముహూర్తం మంచిది చూడండి బాబూ!" అన్నాడు ఆనందంతో పొంగిపోతూ. మెరిసే కళ్ళలో తన గోపాలునివైపు తిరగి, చేతులు జోడించాడు రామశర్మ.

"ఇదిగో వేణుగోపాలా! చూస్తున్నావా? పాపం, ఈ దంపతులు సంతానం కలగలేదని ఎంత దిగులుపడి, క్రుంగిపోతున్నారో!" తమగోడు వెళ్ళబోసుకుంటున్న వారిని చూపుతూ, రామశర్మ జాలిగా వేడుకుంటుంటే, తాము నమ్మిన దైవం వారి చింత తీర్చకుండా ఉండగలడా? "అయ్యవారూ! స్వామి వరాన పుట్టిన యీ బిడ్డకి, ఆ దేముడి పేరే పెట్టాలండి. మేము మొక్కుకున్న ప్రకారం, దూడతో ఉన్న పాడిఆవును కానుకగా తెచ్చాం, ఆ చల్లనయ్యకు. మమ్మల్ని, మా బిడ్డను దీవించండి" అని అంటుంటే, రామశర్మ కళ్ళలో ఆనందబాష్పాలు పొంగి పొర్లాయి వారి మాటలకు.

స్వామి వైపుకు తిరిగి "నువ్వు సంతానగోపాలుడవని పేరు కూడా తెచ్చుకున్నావు సెహభాష్!" అన్నాడు రామశర్మ.

"మీ పూజలకి, పుణ్యకార్యాలకి యింకా ఏం కావలసివచ్చినా ఆ సరుకులన్నీ ఇదుగో! ఈ శివుడున్నాడు కదా! అన్నీ చిటెకలో తెచ్చిపెడతాడు

వీడికి చెప్పండి'' అంటుండేవాడు రామశర్మ. ఈ విధంగా గోపాల స్వామి అర్చనకి, అర్చనస్వామి రామశర్మకాగా, యీ శివుడు సేవకుడైనాడు.

వాని సేవలకు ఫలితంగా అన్నట్లు బుద్ధిమంతుడు. చురుకైనవాడు అనిపించి పిల్లనిచ్చారు గ్రామస్థులలో ఒకరు. కొట్లో ఉండేందుకు ఒక తోడు దొరికింది శివుడికి. ఊళ్ళో కెళ్ళి వాళ్ళు చిన్నచిన్న పనులు కూడా యేవో చేసుకుంటున్నారు.

పుచ్చపువ్వులా వెన్నెల కాస్తోంది. పున్నమి చంద్రుడు ప్రపంచాన్ని ఏలేస్తున్నాడు. గుడివాకిట్లో కూర్చుని, రామశర్మ శివుడి కొడుకుతో ముచ్చట్లాడుతూ, ఆడుకుంటున్నాడు. ఆవేళలో, శివుడు చేతిలో ఏదో పట్టుకుని రామశర్మ దగ్గరకి వచ్చాడు. ఆయన పాదాలముందు ఉంచాడు తాను తెచ్చినవి.

'ఏమిటవి?' అని కళ్ళతో ప్రశ్నించాడు రామశర్మ. వినయంగా చేతులు జోడించి నిలబడ్డ శివుడు "అయ్యా! గురు దక్షిణ'' అన్నాడు. తీసిచూశాడు రామశర్మ. అవి రెండు వెండి దీపాలు! "ఏరా! మరి ఆనాడు వీటిని అమ్ముకోలేదా?'' అన్నాడు తెల్లబోయి చూస్తూ.

"లేదయ్యా! తాకట్టు పెట్టానంతే. కష్టపడి సంపాదించిన పైకంతో తాకట్టు విడిపించుకొచ్చాను. మీకు గుళ్ళో గోపాలుడు దేముడైతే, నాకు దారిచూపిన దైవం, ఆ దేవుణ్ణి చూపిన గురువు మీరే'' అన్నాడు శివుడు. ఇంకా మాట్లాడుతూ "నల్లని ఆ రాతి బొమ్మ ఏం మాట్లాడుతుంది? అనుకున్నాను. ఆ నలుపేమో, మన కళ్ళలో మనస్సులో ఉన్నదేగాని, వాడు చాలా వెలుగుల బొమ్మ అని అనుభవంలో తెలుసుకున్నాను. ఒక్క మాట కూడా మాట్లాడకుండానే, మన జీవితాలను, తన వెలుగులో వెలిగించగలడని, చాలా నమ్ముకున్నాను. నా చీకటి కళ్ళకి వెలుగు చూపించిన ఆ చలవ మీది''.

రామశర్మ చేతిలో ఉన్న పసివాడు గుళ్ళో గోపాలుని మొహంలో మెరిసే నవ్వుకి ప్రతిబింబం అన్నట్లుగా కిలకిల నవ్వాడు అప్పుడే!

**ఓమ్ తమసోz మా జ్యోతిర్గమయ**

■

# గురు కృపాహి కేవలమ్

-రమణ ప్రసాద్

శ్రీ కందర్ప పరశురామయ్యగారు ఎప్పుడూ భగవచ్చింతనతో కాలం గడిపేవారు. తరచు శ్రీ శివానందలహరిలోని శ్లోకాలు చదువుతూ ఆ భావంలో మనస్సును లయింపచేసి అలౌకికానందం పొందేవారు. వారు తరచుగా చదివే శ్లోకాలలో ఇది ఒకటి -

త్రయీవేద్యం హృద్యం త్రిపురహరమాద్యం త్రినయనం
జటాభారోదారం చలదురగహారం మృగధరమ్
మహాదేవం మయి సదయభావమ్ పశుపతిం
చిదానందం సాంబం శివమతి విడంబం హృది భజే ॥

'ఏ మహాదేవుడు వేదములు మూడింటి ద్వారా తెలియబడునో, ఏ మహాదేవుడు స్థూల, సూక్ష్మ, కారణ దేహాలను నిర్మూలించునో, ఏ మహాదేవుడు సృష్టి చేస్తూ, సృష్టికి ముందుకూడా కలడో, ఏ మహాదేవుడు త్రినేత్రములను, జటాజూటమును, సర్పహారమును కలిగి పరమానందమే స్వస్వరూపంగా వెలుగొందునో, ఏ మహాదేవుడు స్వస్వరూప సాక్షాత్కారానికి పరమ సాధనమో, ఏ మహాదేవుడు బ్రహ్మదిలోకాలకు పరిపాలకుడుగా వర్తించునో అట్టి పార్వతీ పరమేశ్వరుని నా హృదయమునందు భావించెదను'

పై శ్లోకంలోని చివరి పాదాన్ని తరచు చదివేవారు -

చిదానందం సాంబం శివమతి విడంబం హృది భజే - అని.

శ్రీబాబు తమ ఇంటికి వేంచేయటం మహాభాగ్యమని అది ఎన్నో జన్మల పుణ్య ఫలమని భావించేవారు.

జలజాత ప్రభవాదులున్ మనములో జర్చించి భాషావళిం
బలుకన్లేని జనార్ధనాహ్వయ పరబ్రహ్మంబు నీ ఇంటిలో
జెలియై, మేనమరందియై, సచివుడై, చిత్త ప్రియుండై మహా
ఫల సంధాయకుడై చరియించుటిది నీ భాగ్యంబు రాజోత్తమా॥

1949లో మా తాతయ్యగారికి సుస్తీ చేసింది. శ్రీబాబు తమతో శ్రీగుండుగొలను గ్రామంనుంచి తమ భక్తులైన అపరధన్వంతరి శ్రీ లంకా శేషగిరిరావుగారిని, శ్రీ మావులేటి చిరంజీవిరాజుగారిని యనమదుర్రు తీసుకువచ్చారు. శ్రీబాబు పూజ చేస్తుంటే నేను ప్రక్కనే కుర్చునేవాడిని. ఒకరోజు శ్రీబాబు అమ్మకు పూజ చేస్తుంటే పీఠం నుంచి వింత ధ్వనులు రావటం, శ్రీబాబు వాటిని వింటూ అదే భాషలో సమాధానాలు ఇవ్వటం నేను గమనించాను. ఆ తరువాత శ్రీ బాబు మా తాతయ్యగారి వద్ద కూర్చుని "శ్రీరామాని పిలిపించమంటారా నాన్నగారూ"అని అడిగారు. "జ్ఞాన పుత్రులు మీరుండగా వాడిని

పిలిపించడం ఎందుకు" అన్నారు మా తాతయ్యగారు. ఆ తరువాత కొన్నిక్షణాలకు మా తాతయ్యగారు భౌతికకాయాన్ని త్యాగం చేశారు. ఆ తరువాత శ్రీ బాబు అందరితో చెప్పింది ఏమిటంటే, తాము శ్రీ లంకా శేషగిరిరావుగారి చేత నాన్నగారిని బ్రతికించుకోవటంకోసం సంజీవని అనే ఔషధాన్ని తయారుచేయించానని, అమ్మను ప్రార్థించానని, కాని అమ్మ నిర్ణయం ఈ విధంగా ఉందని, శ్రీ పరశురామయ్యగారు స్వస్వరూపాన్ని పొందారనీ చెప్పారు

ఆ రోజు పూజా సమయంలో శ్రీబాబు, జగన్మాతతో చేసిన సంభాషణ సారాంశం ఇదే అయిఉంటుందని తరువాత నాకు అనిపించింది.

మా తాతయ్యగారు పరమపదించిన కొన్ని నెలలకు నన్ను హైస్కూల్‌లో చేర్పించే నిమిత్తం మా అమ్మమ్మగారు నాతో వచ్చి భీమవరంలో ఉన్నారు. అప్పుడే నాకు టైఫాయిడ్ జ్వరం వచ్చి అపమారకస్థితిలో ఉన్నప్పుడు మా బాబాయి (కీ.శే. ఆదినారాయణ శాస్త్రిగారు) నన్ను స్కూలులో చేర్పించి ఫీజ్ కట్టడానికి ఆఫీస్ క్లర్క్ దగ్గరకు వెళ్తే ఆయన "అబ్బాయి పేరు ఏమిటి?" అని అడిగితే, "వల్లా వెంకటరమణ" అని చెప్పాడు. ఆ కొర్కెని రెట్టిస్తూ "రమణ తర్వాత ఏమిటి? రమణారావా? రమణమూర్తా ?" అని అడిగి తనకు తాను "బాబు"చేర్చి రమణబాబు అని వ్రాయడంతో నా పేరు చివర "బాబు" అని ఇది శ్రీబాబు నిర్ణయమేమో!

1952 లో సుబ్బరామ్ (మాపిన్నిగారి అబ్బాయి) భీమవరంలో మా ఇంట్లోనే పుట్టాడు. పురుడు మంత్రసాని సహాయంతో మా ఇంట్లోనే పోశారు. మా అమ్మ నాతో "చూడు! ఈ ఇంట్లోకి రావాలంటే పక్క ఇంట్లో నుంచి వచ్చి వంటఇంట్లో కూర్చో."అని చెప్పింది. రాత్రి 7 గంటలు అవుతుంది అనగా నేను పక్కంటి అరుగు ఎక్కుతుంటే ఏదో కుట్టింది. విపరీతమైనపోటు, భరించలేనిబాధ. నేను ఎలాగో వచ్చి వంటింట్లో కూర్చున్నాను. కొంతసేపటికి మా అమ్మ వచ్చి నా ఒళ్ళంతా చెమటలు పట్టడంచూసి "ఏమయింది?" అని అడిగింది. "ఇంట్లోకి వస్తుంటే ఏదో కుట్టింది" అని చెప్పాను. అది తేలు అయి ఉంటుంది. జయమ్మగారి ఇంట్లో బాబు ఉన్నారు. నీ స్నేహితుడు మెహర్‌బాబాతో బాబు దగ్గరకు వెళ్ళు" అంది. మేము బాబు దగ్గరకు వెళ్ళాం.శ్రీ బాబు ఎవరితోనో మాట్లాడుతున్నారు. నన్నుచూసి "ఏరా! ఏమయింది?" అని అడిగితే తేలు కుట్టింది అని చెప్పాను.శ్రీబాబు నన్ను నవ్విస్తూ "తేలు కుట్టిందా?ఎక్కడ?" అని అడిగి నన్ను మాటలలోకి దింపారు. తర్వాత కొంతసేపు అందరితో మాట్లాడి లోపలకు వెళ్ళారు. చిత్రమేమిటంటే శ్రీబాబు సన్నిధిలో ఉన్నప్పుడు నాకు బాధ తెలియలేదు. ఇంటికి రాగానే మళ్ళీ బాధ తెలిసింది. అయితె ఆ ఉదృతం లేదు. మర్నాటికి బాధ మటుమాయం అయింది. శ్రీ బాబు సన్నిధిలో ఉండటంవలననే నాకు బాధ ఉపశమనం కలిగింది. అదే గురుకృప!

■

# దేవ్యుపాసనా ఫలం

- శ్రీ మత్ చంద్రశేఖర సరస్వతీ స్వామి

సౌందర్య లహరిలో చిట్టచివరి శ్లోకంలో శాక్తోపాసకులు ఉపాసనా ఫలితంగా యేయే ప్రయోజనాలు పొందుతారో శ్రీమత్ శంకర భగవత్పాదులు విశదీకరించారు. శైశవంలో ఆకలి వేసినప్పుడు, దాహం వేసినప్పుడు మన శరీరధారణకు కారణమైన కన్నతల్లి ఒడిలో చేరి, ఆక్రందన చేసి, పాలను గ్రోలి, పెరిగి పెద్దవారమైనాము. బిడ్డ కొంచెం ఏడిస్తే చాలు, తల్లి తన పనులన్నీ ఒక వంకకు పెట్టి, తన శిశువును గమనిస్తుంది. శిశువులు తల్లిని నోరారా 'అమ్మా!' అని పిలిచేటట్లు,



లేగ దూడలు కూడా తమ తల్లులను 'అంబా!' అని పిలుస్తాయి. మేస్తూ ఉన్న గడ్డిని వదిలిపెట్టి, దూడ దగ్గరకు వేగంతో పరిగెత్తే, గోమాత హృదయానికే ఆ ఏడుపులోని కలత తెలుస్తుంది. 'అంబారవము నుండియే 'అమ్మ' అనే మాట పుట్టి ఉండాలి. అంబా! అని ఆక్రందించే లేగదూడల వలె మనం కూడా ఆ బ్రహ్మాకీట జనని అయిన అంబిక మ్రోల మొరపెట్టుకుంటే, ఆ లోకమాత అనుగ్రహానికి పాత్రులము కాగలము అని, బృందాంతంలో ఆచార్యులవారు ఫలశ్రుతిగా చెప్పారు.

సరస్వత్యా లక్ష్మ్యా విధిహరి సపత్నో విహరతే ।
రతేః పాతివ్రత్యం శిథిలయతి రమ్యేణ వపుషాః ।
చిరంజీవన్నేవ క్షపిత పశుపాశ యతికరః ।
పరానందాభిఖ్యం రసయతి రసం త్వద్భజనవాన్ ॥

భక్తవత్సలవు నీవు. నీ భక్తులు యేది కోరినా యిస్తావు. లక్ష్మి ఒక చేతితోను, వాణి ఒక చేతితోనూ వింజామరలు వీస్తుండగా నీవు కొలువు తీరుస్తావు. లక్ష్మి, సరస్వతులు నీకు వింజామరలతో సేవ చేయగా, నీ భక్తులు నీకు సేవ చేయరా యేమి? పరిపూర్ణతకు లక్ష్మీ కటాక్షం తప్పనిసరి. ఆ లక్ష్మి పురుషోత్తముని ధామమైన వైకుంఠం వదలి, నీ పాదాల ముందే పడిగాపులు కాస్తున్నది. ఇంతటితో ఆగక నీ భక్తుని సహితం పరిచర్య చేయటానికి సమకట్టుతోంది. అప్పుడు నీ భక్తుని చూసిన పురుషోత్తమునికే అసూయ కలుగుతోంది.

ఎవరైనా సరే, లక్ష్మీ కటాక్షాన్నే మొదట కోరతారు. తన బిడ్డ తెలివితక్కువతనం తల్లికి తెలుసు కనుక లక్ష్మీ కటాక్షాన్ని మొదట అనుగ్రహిస్తే, అజ్ఞానవశాన ధనం దుర్వినియోగం చేసి, పాపాలు మూట కట్టుకుంటాడని అతనికి మొదట సరస్వతీ ప్రసన్నత అనుగ్రహించి, తరువాత ఐశ్వర్యాన్ని చక్కగా అనుభవించే వివేకం యిస్తుంది శ్రీమాత.

"స" మేంద్రో సుధయా శృణోతు రతో మే శ్రియ వమాహవ" అని తైత్తిరీయం చెబుతుంది. మొదట మేధ తరువాత శ్రీ ప్రసాదం. మేధలేనివాడికి డబ్బిస్తే అనర్థమే మిగులుతుందట. ఇట్టిచోట అర్థం అనర్థమే. **అర్థమనర్థం భావయనిత్యం, నాస్తి తతః సుఖలేశ సత్యమ్** - అని భజగోవిందంలో శ్రీ శంఖరభగవత్పాదులే భోధించారు.

సర్వోత్పాదకశక్తి పరాశక్తి. ఆమె కటాక్ష మాత్రం చేత భక్తునికి ఎక్కడలేని తెలివీ పుట్టుకొస్తుంది. మంచి పనులు చేయడం అలవాటు అవుతుంది. అతడు ఎప్పుడూ ఇహానికీ పరానికీ ఉపయోగించే కార్యాలనే చేస్తాడు. ఏకాంత భక్తి నెరపినవాని నాలుకమీద పలుకుల వెలది కాలి గజ్జలమోతలు వినిపిస్తాయి. చదువూ, డబ్బూ, అందమూ అన్నీ ఉన్నా ఆయుర్దాయం లేకపోతే నిష్ప్రయోజనం. అంబికా కటాక్షం ఉన్న సాధకుడు దీర్ఘాయుష్మంతుడవుతాడు.

మంచిది అన్నీ అమరినవి. తతః కిం - తరువాత ఏమిటి? ఈ ప్రశ్న వైరాగ్యానికి బీజం. వైరాగ్యం కనుక సొంతంగానే కలిగితే ఇది క్షణకాలం ఉంటుందో ఉండదో, అది అమ్మదయచే కలిగితే ఆ వైరాగ్యం మేకు పాతినట్లే.

అక్కరలేని విషయాలమీద ప్రేమ మనలను బాధిస్తూ,బంధిస్తూ ఉంటుంది. ఈ పాశాలు ఉన్నంతవరకూ మనం పశువులం. భగవానుడు పశుపరతి డబ్బు,మనస్సు, అందం, ఆయుస్సు అనే పాశాలతో మనలను బంధించి ఉన్నాడు. ఎన్నడు నిర్వేదపూర్వకమైన వైరాగ్యం కలుగుతుందో , ఆనాడు మన పాశాలు జారి పశుత్వంపోయి పరబ్రహ్మలమై కూర్చుంటాము. శుద్ధ ప్రకాశ చేత వస్తువే ఆత్మ. మనం పాశ విముక్తులమైతే పరమానందం మన సొమ్ము. అంబిక మనకి ఇచ్చే అంతిమ ఫలం ఇదే.

పురుషార్థాలను ప్రసాదించేది పరమేశ్వరి. గోమాత కడకు వెళ్ళే లేగదూడవలె శ్రీమాత చరణారవిందాలను చేరితేగాని ఐహిక విషయానుభవము, పిదప ఆముష్మికమగు కైవల్యానందము దొరకదు. *

# శ్రీకృష్ణ కర్ణామృతం

(గతసంచిక తరువాయి)

-సుశీలా ప్రసాద

అందరూ అన్నాలు తింటున్నారు. కృష్ణుడి చేతిలో ముద్ద కదలటం లేదు. చుట్టూ ఉన్న పిల్లలు వానివంకే చూస్తూ "అన్నా! చూడు మేమంతా బువ్వ తినేశాము. నువ్వే వెనక పడ్డావు" అన్నారు. "ఔను గౌరన్న వెనక పడ్డాను" అంటూ నాలుగడుగులు నడిచి ఎదురుగా ఉన్న చెట్ల గుంపుల దగ్గరకెళ్ళాడు కృష్ణుడు. గోవులన్నీ అక్కడ మేత మేస్తున్నాయి. ఒక గున్నమామిడి చెట్టు నానుకుని నిలబడి కన్నయ్య 'మహాలక్ష్మీ!' అని పిలిచాడు. కమ్మని లేత పచ్చిగడ్డి పరకలు కొరుకుతున్న గోమాత తలెత్తి చూసి తనను పిలుస్తున్న కృష్ణుని దగ్గరకు మెల్లిగా నడిచి వచ్చింది. నిండుగా పాలతో ఉన్న కుండల వంటి గోవు పొదుగులను చూస్తూ కన్నయ్య ఒళ్ళు పులకరించి పోయింది. "తల్లీ! బిడ్డల ఆకలి తీర్చే అమృత స్వరూపిణివి. పాపం ఆ జీవుని ప్రాణాలు నిలబెట్టు!" స్వామి ఆజ్ఞ శిరసావహించిన మహాలక్ష్మి కన్నయ్య చేతిలోని పాత్రకు పాలధారలను కురిసి నింపింది.

"గౌరీ! ఈ రెండు మూడు రోజులుగా తిండిలేక అలమటిస్తూ ఏమనుకుంటున్నావు?" కన్నయ్య నోటికి అందించిన పాలను ఆత్రంగా తాగేసిన గౌరన్న కళ్ళనిండా నీళ్ళు నింపుకుంటూ "యాచించే చేతులకి అర్ధాన్నందించే ధర్మదాతవు నువ్వు. లోకంలో వారెవరో వచ్చి నిన్ను ఉద్ధరిస్తారనే దురాశను మొదలంటా త్రుంచేశావు. ఇక నా గతి నీవే అనుకుంటున్నా కృష్ణా! నిన్ను గాక ఎవరిని తలచగలను కృష్ణా!" గౌరన్న సమాధానం వింటూ " నీకా పరిస్థితి కల్పించి, నిన్ను పరీక్షించాను. నువ్వే గెలిచావు" నవ్వుతూ అన్నాడు కన్నయ్య.

ఎక్కడెక్కడో తపస్సమాధి నిమగ్నులై ఉండే మునీశ్వరుల మనో కమలాలలో నిండి వారిని బ్రహ్మానందంలో ఓలలాడించే గోపాలబాల రూపకుడైన పరమాత్మ కమ్మని మోవిపై నిలిపి పలికించే మురళీనాదాన్ని నేడు గౌరన్న వీనుల విందుగా ఆలకిస్తూ తన్మయుడై పోతున్నాడు. కన్నయ్య చెప్పే తీయని మాటలు వింటూ పరవశించి పోతున్నాడు. గోపబాలుర చద్దిమూటలలోని బువ్వలో పాలు పంచుకు తింటున్నాడు. పుట్టిన నాటి నుంచీ

ఎరగని ఎంతో ఆనందాన్నీ, సుఖాన్నీ యిప్పుడు సంపూర్తిగా అనుభవిస్తున్నాడు గౌరన్న. అలాంటి సమయంలో..................

తనకి ఎదుటివాళ్ళు ఎలాగ ఉంటారో తెలియక అమ్మనడిగితే ఆవిడ తన చెవులు, ముక్కు, కళ్ళు, నోరు, కాళ్ళు, చెతులు అన్నీ పట్టి చూపించి అవే వాళ్ళకీ ఉన్నాయని చెప్పింది. నాటి నుంచీ అదే భావనలో ఉంటూ వచ్చిన అతడు, ఇప్పుడు కన్నయ్య ఎలాగ ఉంటాడోనని ఆలోచించ సాగాడు. ఇప్పటి వరకు తనెరిగి పెరిగిన లోకంలో అంతా నోటితో పలికే కటువైన మాటలు వింటూ, చాల కష్టపడుతూ వచ్చాడు. దురుసుగా ప్రవర్తించే వారి చేతలలో కూడా నిరసన వ్యక్తమవుతుంటే గౌరన్న ఎవరికీ చెప్పుకోలేని తన దుస్థితికి కుమిలిపోతూ ఉండేవాడు. కాని అటువంటి కాళ్ళు, చేతులు, నోరు, చెవులు, మనస్సే కన్నయ్యకి ఉంటాయంటే అతడికి నమ్మబుద్ధి కావటం లేదు. ఎందుకంటే ఇతరులకి కన్నయ్యకి చాలా తేడా ఉందని అతను గ్రహించాడు గనుక. తాను అనుభవించి చూస్తున్నాడు గనుక.

ఆ మాటలతో ఆత్మీయత, చేతలలో అభిమానం, చెవులలో తన గోడు వినే ఓర్పు, నడిచినప్పుడు ఆ కాలి అడుగుల సవ్వడిలో ఎంతో మాధుర్యం ఉన్నట్లు తోచి, అతడు ఇతరుల వంటి సామాన్యుడు కాడని, తనకి దిక్కయిన దేవుడని గౌరన్న మనస్సుకి బోధపడి పోయింది. మరి అలాంటి వాడిని ఒక్కసారి చూడగలిగితే ఎంత బాగుండు ననిపిస్తోంది. కానీ అడగకనే అన్నీ యిచ్చే ఆ దేముణ్ణి లేకిగా తనొక కోరిక కోరటం ఆ దైవాన్ని చిన్నబుచ్చినట్టు అవుతుందేమో! తమ మనస్సు నెరిగిన వాడికి వేరే చెప్పాలా? తన కోరిక తీరే ఆ రోజు రాకపోతుందా?

చెవులు చిల్లుపడేంత పెద్దచప్పుడు వింటూ ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు గౌరన్న. అప్పటికే అతడు నిలువెల్లా తడిసిపోతున్నాడు. వాన చినుకులు రాళ్ళల్లా మీదపడుతున్నాయి. శరీరం తట్టుకోలేనంత చలికి గడగడ వణికి పోతుంటే, పెద్దగా గొంతెత్తి 'కన్నా!' అని ఒక్క కేకపెట్టాడు. ఆ క్షణానే రెండు సుకుమారమైన చేతులు అతన్ని గట్టిగా పట్టుకున్నాయి.

-సశేషం

# పరిప్రశ్నేన సేవయా

-పరాశర ప్రసాద్

ఆత్మ మూడు అవస్థలలోనూ మార్పు చెందదు కదా! అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీగురుదేవులు 'ఆవిషయం అప్పుడు పుట్టిన పిల్లవాడి తండ్రి కూడా చెబుతాడు. నువ్వు ఎలా చెప్పగలుగుతున్నావు? నేను చెప్పిన బోధను వినిగాని, లేదా ఏదైనా గ్రంథ పఠనం ద్వారా గాని చెప్పగలుగుతున్నావు. అంటే శాస్త్ర జ్ఞానముగాని, శబ్ద జ్ఞానముగాని అయి ఉంటుంది. అనుభవ పూర్వకరంగా చెప్పినట్లయితే సంతోషించేవాడిని'' అన్నారు.

ఇంకా బోధని కొనసాగిస్తూ "సత్, చిత్, ఆనంద రూపమేదైతే ఉందో అదే ఆత్మ వస్తువు. అది అవస్థాత్రయ సాక్షి. నాకు స్వప్నం వచ్చింది. నాకు గాఢంగా నిద్ర పట్టింది. నాకు మెలకువ వచ్చింది అనటం వలన జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థల మూడింటిలో నీవు ఉన్నావు అన్నది తెలుస్తోంది కదా! ఎలా అంటే నిదుర నుంచి మేల్కొన్న తరువాత మళ్ళీ అన్ని విషయాలను జ్ఞాపకం చేసుకుని అనుభవిస్తున్నావు కదా!

అంతేకాదు, నిదురించక ముందు సగం పూర్తి చేసిన పనులు మేల్కొన్న తరువాత, విడిచి పెట్టిన దానిని పూర్తి చేస్తున్నావు కదా!

విత్తనంలో కొమ్మలు, రెబ్బలు, ఆకులు, పూవులు, కాయలు ఎలా దాగి ఉన్నాయో అలాగే నిదురావస్థలో కూడా తెలియని స్థితి . అవస్థలు వచ్చేవి, పోయేవి గాని నీవు మాత్రం ఎప్పుడూ ఉన్నావు.

సినిమా తెరమీద రకరకాల బొమ్మలు వస్తాయి, పోతాయి. సముద్రపు అలలు గోచరించ వచ్చు లేక మండే అగ్ని గోచరించవచ్చు. అవేవీ తెరకు అంటవు. అలాగే మూడు అవస్థలలో కలిగే కల్లోలాలు ఏవీ నీకు అంటవు.

జాగ్రత, స్వప్న, సుషుప్తి అను మూడు అవస్థలలో సాక్షిగా ఉండి నిత్యంగా , అఖండంగా, జ్ఞానరూపంగా మనలో ప్రకాశించే చైతన్యమే ఆత్మ. అదే నీవు. అని అనుభవ పూర్వకంగా తెలుసుకొన్న వాడే జ్ఞాని'' అన్నారు శ్రీబాబు.

■

# ఓం శివాయ గురవే నమః

-లక్ష్మి.M.(ఆర్.టి.సి)

మహనీయాత్ముడు - మంగళకరుడు - జ్ఞానసాగరుడు- భక్తవత్సలుడు- గురుడే. మంగళకరుడు - శివంకరుడు - శుభంకరుడు - శివుడు. ఆ కనబడని పరమ శివుడు గురుడే. కనబడే గురుడు - శివుడే. ఆద్యంత శూన్యుడూ, అనంతుడూ అయిన ఆ గురుపరబ్రహ్మనే శుభంకరుడు - శివంకరుడూ అయిన శంకరునిగా భావించి స్తుతిస్తూ ఆదిశంకరాచార్యుల వారు శివానందలహరిలో ................

"సర్వవ్యాపకా! నీకు వస్త్రోపచారము చేయుటకు వేయి కరములు (అనేక కిరణములు) కలవాడైన సూర్యుడు కదా కావలయును? సర్వవ్యాపకుడైన నీకు పుష్పోపచారము చేయవలెనన్న సర్వవ్యాపకుడైన విష్ణువు కదా! సమర్థుడు? అందుచే విష్ణువు కావలయును. నీకు గంధము సమర్పించి గంధోపచారము చేయుటకు గంధవాహుడైన వాయుదేవుడు కదా! సమర్థుడు? స్వామీ! మీకు హవిస్సు నివేదన చేయుటకు అగ్నిముఖాధ్యక్షుడగుటచే ఇంద్రుడు గదా పాత్రుడు? స్వామీ! మీకు పాత్రోపచారము చేసి, అర్ఘ్య పాద్యాచమనాలు చేసి సమర్పించుటకు హిరణ్యగర్భుడైన బ్రహ్మదేవుడు కదా! కావలయును? ఈ వివిధోపచారములు సమర్పించుటకు నేనెట్లు సమర్థుడను ప్రభూ! నా తరమా! ఇప్పుడు నేనున్న స్థితిలో శుశ్రూష చేయుటెట్లు?" అనిరి.

ఈశ్వరుడు - గురువు - ఆత్మ వేరువేరుగా చెప్పబడినప్పటికీ - అనంతమైన గురువే - ఆత్మగా - ఈశ్వరుడిగా కూడా భాసిస్తున్నాడు అని శ్రీగురుదేవుల ఉవాచ. ఆద్యంత శూన్యుడు, అనంతుడు అయిన ఆ పరబ్రహ్మ అవ్యాజ కరుణాపూర్ణుడై, శిష్యోద్ధరణ - జగదోద్ధరణ కొరకుగా భక్తిని సిద్ధింపజేసి, ఆనందానుభవాన్ని ప్రసాదించుటకు గురుమూర్తిగా అవతార స్వీకరణ చేసి మానవ రూపంలో మన మధ్యన అవతరించి, జ్ఞానబోధ చేస్తారు. ఆ గురుపరబ్రహ్మను నరుడని యెంచక ఈశ్వరుడని నమ్మి గురుపాదములను ఆశ్రయించిన శిష్యునికి జ్ఞానదృష్టిని ప్రసాదిస్తారు. అప్పుడు శిష్యుడు కూడ జ్ఞానపూర్ణుడైన గురు పరబ్రహ్మమును ఎల్లెడలా దర్శించి, ఆరాధిస్తాడు. ఎవరు ఎవరిని ఏవిధంగా అర్చించుట? జ్ఞానియైన శిష్యుని అంతరంగం ఎలా ఉంటుంది? అందు గురుస్థాన మెద్ది? ఎక్కడ?

మహోసూక్ష్మాతి సూక్ష్మమై, సర్వవ్యాపకమై యింద్రియాదులకు గోచరించని నిరాకార వస్తువగు పరబ్రహ్మను ఎటుల ఆహ్వానించుట? ఒకచోట మాత్రమే ఉన్న యెడల మరియొక చోటికి ఆవాహయామి - స్థాపయామి అని

ఆవాహన చేయవచ్చును. పరిపూర్ణ వస్తువునకు ఎక్కడి నుండి ఎక్కడికి ఆహ్వానించుట - ఉద్వాసన చెప్పుట? అట్లే ఆకారమున్న వానిని మంత్రములచే, సర్వావయములను పూజింపవచ్చును. రూప - నామములు లేని పరబ్రహ్మమును ఎట్లు పూజించుట? ధ్యానమునకు ఆధారముండిన కదా! ధ్యానింప శక్యమగును! లక్ష్యమును కనుగొనిక కదా! నాదమునో - బిందువువో - కళనో- జ్యోతినో- దర్శింపవచ్చును ధ్యానమునందు! నిరాధారమును నెట్లు ధ్యానించుట? మరియు "సమస్త జగదాధారమూర్తయే" అని ఆయనయే సర్వమునకు ఆదారమై యుండగా - ఆయనకు ఆసనమును ఆధారముగా కల్పించుట యెట్లు?

దేనిచేతా అంటబడని నిరంజనుడు - నిర్గుణుడు, అయిన విశ్వవ్యాపకునకు అర్ఘ్య-పాద్యములు ఎట్లు సమర్పించుట? నిర్మలుడైన వాడికి స్నాన విధి యెట్లు? విశ్వ ప్రకాశకుడై- స్వయం ప్రకాశకుడైన వానిని వస్త్రముతో ఆచ్ఛాదించుట యెట్లు? వాసనలను హరించు వాసుదేవునికి గంధ -పుష్పాది ఉపచారములు చేయగలమా? నిత్యతృప్తునికి నైవేద్య - తాంబూలము అర్పించుటా? అనంతుడూ, విశ్వవ్యాపకుడూ అయిన గురుపరమాత్మకు ప్రదక్షిణ నమస్కారము నెట్లాచరించుట?

వేదములు కూడా గురుపరబ్రహ్మమును కొంతమేరకే స్తుతించ గలిగినవనీ, తరువాత ఆగిపోయినట్లు శ్రీగురుదేవులే ప్రవచించేవారు. అట్టి వేదవేద్యునకు స్తోత్ర సమర్పణ చేసి స్తుతించుటెట్లు? స్వయం ప్రకాశకుడై సర్వజగత్తుకూ ఆధారభూతుడై, సర్వమునూ ప్రకాశింపజేసే చైతన్యమూర్తికా? నీరాజనమిచ్చుట! అంతర్బహిశ్చ వ్యాప్తః అన్నట్లు - బాహ్యాభ్యంతరములయందు నిండి పూర్ణుడైన గురు పరబ్రహ్మకు ఉద్వాసన పలుకుటెట్లు?

ఈ విధమైన పరాపూజను ఎవరు? ఎవరికి? చేయుట. రెండవ వస్తువు ఉన్న కదా! గురుపరమాత్మను ఆత్మగతుడుగా భావించి - తనయందే దర్శించి ఆనందించు శిష్యుడు యీ విధముగా గురుపరమాత్మను ఎల్లెడలా దర్శించి, ఆనందాంబుధిలో ఓలలాడుటే నిత్యపూజా విధియై ఉన్నది. అప్రత్యక్షుడైన మహాదేవుడు తన మాయచే తానే అవతారమును స్వీకరించి, గురురూపంతో మన మధ్య, మనలాగే ప్రవర్తిస్తూ ఆత్మ ప్రబోధం చేస్తూ మన భక్తిని సిద్ధింప జేస్తున్నారు. సిద్ధించబడటమంటే అనుభవంలోకి రావటమే. ఆ విధంగా అనుగ్రహ స్వరూపులైన అనుభవ స్వరూపులైన గురుదేవులకి శతకోటి వందనాలర్పిస్తూ.. లోజూపునిచ్చి - మాలో నిన్ను జూపి - నీలో మమ్ము చేర్చుకోవలసిందిగా ప్రార్థిస్తూ.......

■

# హనుమంతునికి అమనస్క ఉపదేశము

- ఈవూరి రోశిరెడ్డి

"ఆంజనేయుడికి నా తత్త్వాన్ని నీవే ఉపదేశించు" అని శ్రీరామ చంద్రుడు, తన చరణ సన్నిధిలో కూర్చుని ఉన్న హనుమంతుని చూపి సీతామాతతో అన్నాడు.

పవన కుమారుడు తనేమీ కోరలేదు. తన ఆరాధ్యదైవం యొక్క సేవ తప్ప, తనకింకేమీ అక్కరలేదు. అయినా, అంతటి నిష్కామ సేవా పరాయణుడు లభించినప్పుడు శ్రీరాముడేవిధంగా ఊరకుండ గలడు. 'భక్తి' దేవత విరాజిల్లే చోట ఆమె బిడ్డల వంటి జ్ఞాన - వైరాగ్యాలు చేరుకుంటాయి. - అలా కానట్లయితే ఆ భక్తి గొడ్రాలు వలె విలువ లేకుండా పోతుంది గదా! శ్రీరాముని పట్ల అనురక్తితో పాటు లోకం పట్ల శ్రద్ధ కూడా ఉండే తీరాలి గదా!

పరమాత్మ పట్ల ప్రేమ గలగడంతోనే నిశ్చలమైన, ప్రేమకు అరమరిక లుంటాయా? కాబట్టి మూకుమ్మడిగా వచ్చేస్తాయి. వీటిలో వెనుక ముందు లేక పరిణామ కారణాంతరం గాని రావు.

ప్రబల వైరాగ్య ప్రభంజన తనయుడైన ఆ పవన పుత్రుడు స్వతహా విరాగమూర్తి. అంతేగాక ప్రేమమూర్తియైన శ్రీరాముని దయ సహజంగానే ఆయనకుంది. ఇందువల్లనే ఆయన జ్ఞానులలో అగ్రగణ్యుడు. ఇక తన అంతరంగ శక్తియైన ఆ శ్రీశక్తిని, ఉపదేశించమన్నారంటే, ఆయన స్నేహ వాత్సల్యతకు నిదర్శనం. హనుమంతుడు అంజలిబద్ధుడై కొంచెం తలపైకెత్తి, అనంత ప్రేమమూర్తియైన జగన్మాత వైపు రెప్పవాల్చక చూడసాగాడు.

'ఈ అయోధ్యాధీశుడు ఆది మధ్యాంత రహితుడు' అని పరతత్త్వాన్ని ప్రారంభించింది - పరాశక్తి రూపిణి - 'ఈయనే నిర్గుణ, నర్వికార, నిష్క్రియ, నిరుపమ ధర్మమూర్తి. ఈయన మాటలకూ మనస్సుకూ అందనివాడు. ఊహించడానికి అందని యీ మహనీయుడు అవాఙ్మానస గోచరుడు.

'పరిపూర్ణమైన అఖండ తత్త్వము నందు, మార్పుగాని, చంచలత్వం గానీ ఉండవని, నీవు తెలిసుకొనగలిగి ఉన్నావు' - అని శ్రీవైదేహి తన బోధామృతాన్ని కొనసాగించారు. 'నా యీ ఆరాధ్య దేవులని ఎవ్వరూ అంచనాల

ద్వారాగాని, జ్ఞానం ద్వారా గాని గ్రహించలేరు. ఈయన నిజస్వరూపమగు సత్, చిత్, జ్ఞాన స్వరూపాన్ని సూచించడానికే యీయన్ను సచ్చిదానందుడు' అన్నారు.

నీవు ఆరాధిస్తున్న యీ మహనీయుడు ఏమీ చేయక నిశ్చలంగా వెలుగొందుతూ ఉంటాడు. ఈయన నడిచినా, పనిచేసినా, తిన్నా, నిద్రించినా నిమిత్తమాత్రమగు లీలే! ఈయన కర్త కాని, భోక్తకాని కాడు. ఇదంతా నావలనే జరుగుత్నుది. అయితే యీయన వలనే జరుగుతున్నాయని అనిపిస్తుంది. నా యోగమాయా లీలా విలాసమే యిదంతా సాగిస్తూ ఉంది. ఈ చిద్ఘన శ్రీవిగ్రహం మాత్రం నిమిత్తమే!

ఈయనకున్న శక్తీ, ప్రకృతి, యీయనకున్న యోగమాయా అంతా నేనే. ఈయనది కాకుండా నాదంటూ ఏదీలేదు. కాని నా ఉనికి లేనిదే యీయనకి విడిగా మనుగడగానీ, ఉపాధిగానీ లేనే లేవు. నిజానికి నిర్గుణుడైన యీయన నా వలన సగుణుడిగా ప్రకటితమవుతున్నాడు. నేను, వీరితో నిత్యమూ అభేదమై ఉండి, శాశ్వతంగా సమాశ్రయం పొంది ఉన్నాను. నా అధిష్టాన దేవత ఆయనయే!

'ఈ చరాచర ప్రపంచమంతా నా లీలా విలాసమే! లెక్కకు మిక్కిలిగా ఉన్న బ్రహ్మాండాలన్నీ నా నుండియే వెలువడుతున్నాయి. వాటి స్థితి లయాలకు కూడా నేనే కారణం. ఇదంతా కేవలం శక్తి విజృంభణమే. ఆ శక్తిని నేనే! ఈ మహితాత్మని అంశమే ఇదంతాను! వేరేగా మరేమీ లేదు.

ఈ ఆనందమయుని యందు నా ద్వారా ఆరోపితమైన సచ్చిదానందమే. నాలో ప్రతిబింబించి, నా స్థూల రూపమై, నా ప్రకృతి రూపమై, క్రమంగా తమమనీ, రజమనీ, సత్వమనీ అనబడుతుంది. ఈయన కత్యంత ప్రేమ మయినయిన నన్ను, శాస్త్రాలు సంధినీగా, సంవితగా, హ్లాదనీగా ఆరాధించ దగిన దానినని తెలుపుతున్నది. ఈ సమస్త సృష్టి నా విలాసమే! నా అధిష్టానమై విరాజిల్లే యీయన వినోదం కొరకే నేను వేడుకగా ఉంటాను. ఈయనను సంతృప్తి పరచటం తప్ప నాకు మరేమీ కావలసింది లేదు. ఈయన కృపా కటాక్షం ఉన్నంతవరకే నా ఉనికి, యీయనకి ఉపకరించడమే నా శ్రేయం. ఈ మహనీయునికి ఇష్టంకాకుంటే నేను వీరిలోనే యిమిడిపోతాను బహిర్గతంకాను".

-సశేషం

# బాబాజీ రాజయోగి

(గత సంచిక తరువాయి)

- రామస్వామి సంపత్

శ్రీబాబు పన్నెండేళ్ళ ప్రాయంలోనే కందర్ప పరశురామయ్యగారనే మహనీయునికి అతిసన్నిహితులై, అభిమానపుత్రులయ్యారు. అక్షరాభ్యాసం చేద్దామని బాబూజీకి పలకా బలపం ఇచ్చారు. "నాన్నగారూ! బలపం పలకపై ఉంచేసరికి నాకు ఆ పలకపై జగన్మాత దివ్య వదనం కనిపిస్తున్నది. ఆ వదనంపై ఎలా వ్రాయను?'' అని ప్రశ్నించారట! ఆ బాలుడు అక్షర పరబ్రహ్మ స్వరూపుడనీ, ఆయనకు అక్షరాభ్యాసంతో పని లేదనీ పరశురామయ్యగారు గ్రహించారు. ఏ అభ్యాసం ఎరగని ఆ వయసులోనే బాబు సరళమైన భాషలో వేద, ఉపనిషత్, శాస్త్ర విషయాలను విపులంగా చెప్పేవారు. ఉద్దండ పండితులు అవాక్కయి పోయేవారు.

లేత వయస్సులోనే ఆసేతు హిమాచలం పర్యటించి, క్షేత్రాలను, క్షేత్రజ్ఞులను దర్శించి, శ్రీశైలంలో పాపికొండలలో తపస్సు చేయాలనుకున్నారు గాని, అజ్ఞానమనే అంధకారంలో కొట్టుమిట్టాడుతూ, దుఃఖానికి లోనౌతున్న సోదర మానవుల పట్ల బాబూజీకి యెనలేని సానుభూతి ఉండేది. అలాంటి మానవులలోని అజ్ఞానాన్ని పారద్రోలి, జ్ఞాన స్వరూపులుగా చేయాలని, పరమాత్మని సగుణంగానూ, నిర్గుణంగానూ కూడ దర్శించి, తాను పొందిన ఆత్మానుభూతిని జిజ్ఞాసువులకు అందించాలని శ్రీబాబు సంకల్పించి ప్రణాళికా నిర్వహణ కోసం ప్రజల మధ్యకు వచ్చారు.

శ్రీబాబు బోధన, భావన, ఆచరణ కూడా సగుణ, నిర్గుణాల మేలు కలయికగా భాసిల్లుతున్నాయి. సాధకుని అంతిమ లక్ష్యమైన అద్వైత సిద్ధికి అదే అత్యుత్తమమైన మార్గమని శ్రీబాబూజీ పదేపదే అంటూ ఉండేవారు. సన్యాసమంటే మనసుకు సంబంధించినదనీ, భౌతిక విషయాలపట్ల మనసులో విరాగం కలిగిననాడు సంసారాన్ని, దారాపుత్రులను, నిజవృత్తిని విడిచి పోవలసిన అవసరం లేదని, తన కుటుంబ బాధ్యతలను, సంఘబాధ్యతలను దీక్షా దక్షతలతో నిర్వర్తిస్తూ, లభించిన ఫలితాలను భగవదర్పణంగా భావించాలనీ, మనసులో మాత్రం పరమాత్ముడైన గురుదేవుని దివ్యపాదపద్మాలకు శాశ్వత స్థానం కల్పించుకోవాలనీ అదే రాజయోగమనీ శ్రీబాబు ఉద్ఘాటించేవారు.

-సశేషం

# భగవత్సాక్షాత్కారము

- రమణ ప్రసాద్

భగవంతుని ప్రతిమనుగాని, పటమునుగాని నీ ముందు ఉంచుకొని దృష్టిని ప్రతిమ లేక ప్రతిమలోని కనులపై కేంద్రీకరించు. భగవంతుని రూపాన్ని ద్యానించు. భగవంతుడు ఆ ప్రతిమరూపంలో గాని, పటమురూపంలోగాని దర్శనమిస్తాడు. సంపూర్ణ విశ్వాసంతో చేసిన ధ్యానం భగవత్సాక్షాత్కారానికి దారి తీస్తుంది. భగవత్ప్రాప్తికి ఇది ఒక సులభమైన మార్గం.

భగవంతుడే అన్ని వస్తువులలో దర్శనమిస్తున్నాడు అని విశ్వసించు. చెట్టునుగాని, రాయినిగాని, జంతువునుగాని దేనిని చూసినా దనిని భగవంతుని రూపంగా భావించు. మనస్సు ఎక్కడికైనా పరిగెత్తనీ. అన్ని రూపములు భగవంతునివే కదా! నీకు కనిపించిన ప్రతి వస్తువుకు నమస్కరించు. జగత్తులో దేనిని చూసినా నారాయణ స్వరూపంగా దర్శించు. సమస్త వస్తు జాలాన్ని భగవంతుని రూపంగా చూసే ఈ అభ్యాసం వల్ల భగవద్దర్శనం కలుగుతుంది.
శాస్త్రాలలో వేలకొలదీ మార్గాలు సూచించబడ్డాయి. వాటినుండి సాధకుడు తనకు నచ్చిన మార్గాన్ని ఎంచుకోవచ్చు. జగత్తులోని ప్రతి వస్తువును భగవంతునిగా చూస్తే సమదృష్టి అలవడుతుంది. ఈ సులభ మార్గాన్ని నిలకడగా అభ్యసిస్తే, ముక్తి లభిస్తుంది.

మనోభావనలు రెండు విధాలు.మనకు నచ్చేవి, నచ్చనివి. మనస్సుకు నచ్చేవాటిని మనం ఇష్టపడతాం. నచ్చనివాటి జోలికి పోం. నచ్చే విషయాలు ప్రమోదాన్ని కలిగిస్తాయి. నచ్చనివి దుఃఖాన్ని కలిగిస్తాయి. నచ్చనివాటివల్ల కలిగే దుఃఖాన్ని ఒక వరంగా భావించు. ఏది జరిగినా భగవదేచ్ఛగా భావించు. దేవుని ఆజ్ఞ లేకుండా గడ్డిపరకైనా కదలదు. మంచి జరిగితే ఆనందించి, చెడు జరిగితేకుంగిపోయే ప్రవృత్తితో భగవంతుని తెలిసికోలేం. భగవంతునికి ఏవి ప్రీతికరమో వాటిపై మక్కువను పెంచుకోవాలి. అనుకూల పరిస్థితులు ఆనందం కలిగించినా, విషమ పరిస్థితి ఎదురైతే ధైర్యంగా ఎదుర్కోవాలి. భగవంతునికి ఆమోదకరమైనవి కాకపోతే అవి జరగవు కదా.

భగవంతుని పొందటానికి ఈ భావన తోడ్పడుతుంది. మనస్సు ఆనందస్థితిలో ఉంటుంది.

పైన చెప్పబడిన అభ్యాసం కష్టతరమైతే సత్యవాక్పరిపాలన చెయ్యి. సత్యాన్నే పలుకు. సత్యాన్ని ఆచరించు. నీ ప్రవర్తనలో సత్యాన్ని ఋజువు చెయ్యి. ఇది ముకితకి దారి తీస్తుంది. ఒక హిందీ కవి ఇలా అన్నాడు -

సాచ్ బరాబర్ తప్ నహీ, ఝూట్ బరాబర్ పాప్ ।
జాకే హిరదై సాచ్ హై, తాకే హిరదై ఆప్ ॥

"సత్యాన్ని మించిన తపస్సు లేదు. అసత్యాన్ని మించిన పాపం లేదు. ఎవరి హృదయం సత్యమయమై ఉంటుందో ఆ హృదయంలో మీరే (భగవంతుడే) ఉంటారు.

ఈ ప్రపంచంలో కనపడే వస్తువులన్నీ భగవంతుడి రూపాలే. కనుక వాటిని ఆ దృష్టితో చూడు. ఈ జగత్తు భగవంతుని సృష్టి. ఇది గుర్తించి ప్రపంచభావనను పోగొట్టుకో. అందరిలో భగవంతుని చూడటం అలవరుచుకో.అది భగవద్దర్శనానికి దారి తీస్తుంది. భగవధ్యానం చేయలేకపోతే ఈ అభ్యాసం చెయ్యి.

అదికూడా చేయలేకపోతే నువ్వు వినే ప్రతి శబ్దం భగవద్వాణిగా భావించు. గంగానదిలోని అలల శబ్దాలూ, పీచేగాలుల గలగలలూ, పక్షుల కలకలారవాలూ భగవంతుని అంశయే. నాదో బ్రహ్మ అన్నారు. మనం వినేదంతా భగవంతుని శబ్దమే. నిన్ను ఎవరైనా దూషించినా అది భగవంతుని వద్ద నుండి వచ్చిన శబ్దమే.మనని ఎవరైనా దూషిస్తే దానిని మనం బాధపడితే భగవంతుని శబ్దం వినపడదు. భగవంతుని శబ్దం వినగలిగితే అనందానుభవాన్ని పొందగలుగుతాం. మనను చేసే దూషణలో భగవంతుని చూడు. దూషణ భూషణలను లెఖ్ఖ చేయకు. ఇది అభ్యాసం చేస్తే భగవత్ప్రాప్తి కలుగుతుంది.

ఇదికూడా చేయలేకపోతే భగవద్ధ్యానం చెయ్యి. ఏకాంత స్థలానికి వెళ్ళి ఉచితాసనం వేసికొని నిఠారుగా కూర్చో. కనులు మూసికొని ధ్యానం చెయ్యి. మనస్సు ఎటు వెళ్ళినా, భగవంతుడినే చూడు. నీమనస్సును ఒక మంచి మిత్రునిగా భావించు.

-సశేషం

# శ్రీకృష్ణాష్టమి వేడుకలలో శ్రీమాతాజీ

## అనుగ్రహభాషణ

కారాగారంలో ఉన్న దేవకి,వసుదేవులకు కృష్ణుడు పుట్టాడు అన్నాం. మనస్సులో వచ్చే భావనే పుట్టుక. భగవద్భావన లేకపోవటమే కారాగారవాసం. దేవకీ వసుదేవుల పుణ్యఫలంగా శ్రీకృష్ణుడు ఆవిర్భవించాడు. కారాగారం అంతా వెలుగుతో నిండిపోయింది. మనలో అజ్ఞానం తొలిగితే ఉండేది వెలుగే. అది స్వయంప్రకాశం. అది కృష్ణకాంతి. దేవకి ఆ పసిబాలుడిని తన ఒడిలోకి తీసికొని ముద్దాడింది. వసుదేవుడు దేవకితో " ఈ బాలుడిని గోకులంలో నందుని ఇంట్లో దించి యశోదకుపుట్టిన యోగమాయను తీసుకురమ్మని భగవదాజ్ఞ'' అని చెప్పాడు. జైలు తాళాలు వాటంతటవే తెరుచున్నాయి. వసుదేవుడు ఆ నిశీధిలో బయల్దేరాడు. హోరున వర్షం. యమునానది పరవళ్ళు తొక్కుతోంది. ఆదిశేషుడు పడగ పట్టగా యమునానది త్రోవ ఇచ్చింది. శ్రీకృష్ణుడు అలవోకగా తన పాదాలను బయట పెట్టాడు. తన అలలతో ఆయన పాదాలు తాకి యమునమ్మ మురిసిపోయింది. వాయుదేవుడు స్వామి దివ్య పరిమళాలను అనితటా వ్యాపింపచేశాడు. పృథ్వి పులకించిపోయింది. పృకృతి దివ్యకాంతులతో నిండిపోయింది.

ఆ చిన్ని పాదాలు మనలో లేవా? ఉన్నాయి. అవి మన సొంతం. తన బిడ్డ దూరమవుతునానడనే దేవకికి ఆవేదన రాగానే శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షమై, తాను లోకోద్ధరణకోసం అవతరించానని చెప్పి జరగవలసిన కార్యాన్ని వివరించాడు. భగవత్సాక్షాత్కారం కాగానే వారి దుఃఖం పోయి ఆనందం వెల్లివిరిసింది. భగవంతుడికోసం ఎదురుచూసేటప్పుడు ఉన్న ఆవేదన భగవత్సాక్షాత్కారం అయితే ఉండదు. ఆ కూటస్థ చైతన్య పరబ్రహ్మం మానవాళిని ఉద్ధరించటానికి దేవకీ వసుదేవులకు పుట్టినట్లుగా పుట్టాడు.

మనం చేసికొన్న పుణ్యం వలనమనకు లభించిన స్థిరమైన పెన్నిధి మన గురుపాద సన్నిధి. మనకు భగవంతుడు ఇచ్చిన సంపదలలో పడి మోసపోవద్దు. ప్రాలుమాలుటకు సమయం కాదిది. ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్ నిబోధిత అన్నాడు శ్రీవివేకానందస్వామి. జీవతం క్షణభంగురం. కాబట్టి నిరంతరం భగవంతుని తలవాలి. అర్జునునికి ఒక సందేహం వచ్చింది . అంత్యకాలంలో భగవంతుని తలిస్తే చాలు కదా మోక్షప్రాప్తికి అని. అర్జునుడు శ్రీకృష్ణుణ్ణి అడిగాడు "బావా! చివరిక్షణంలో భగవంతుని తలిస్తే చాలదా?

”అని. దానికి శ్రీకృష్ణుడు “బావా! నువ్వు విడిచే ప్రతి శ్వాస అంతిమ శ్వాసగా భావించి నిరంతరం భగవద్ధ్యానంలో ఉండు” అని చెప్పాడు. కాబట్టి ఎప్పుడూ పరమార్థ భావనలో ఉండి జీవితం సార్థకం చేసికోవాలి.

ఇక కథలోకి వద్దాం.శ్రీకృష్ణుడు వ్రేపల్లెకు వచ్చాడు కదా. వాడి ఆటపాటలు ఏమిటో చూద్దాం. వ్రేపల్లెలో ప్రతి గోపిక హృదయం తల్లి హృదయం అయింది. ఆబుజ్జిబాలుణ్ణి ఎత్తుకోవాలని అందరూ ఆరాట పడ్డారు. ఆయన అందరివాడేగా! అందేవాడేగా! అందరికీ అందుబాటులోకి వచ్చాడు. తనని సంహరిద్దామని వచ్చిన పూతనకు కూడా చిక్కాడు. మాతృ హృదయంతో తనకు క్షీరాలను ఇవ్వడానికి వచ్చింది. తన క్షీరాలను విషంగా మార్చి ఇచ్చినా ఆమెకు సద్గతిని ప్రసాదించాడు. ఆ రాక్షసి పెద్ద ఆకారంతో కొన్ని యోజనాల విస్తీర్ణంతో పడిపోయింది. దానిని ఖండ ఖండాలుగా చేసి దహన సంస్కారం చేస్తే అంతటా దివ్యపరిమళాలు వ్యాపించాయి. అది ఎలా సంభవం అయింది అంటే ఆ రాక్షసికి శ్రీకృష్ణుని స్పర్శ కలగటంచేత. భగవంతుని పాదాలు గట్టిగా పట్టుకన్న వారికి భయం ఎక్కడిది?

మనం సాధన క్రమంగా చేయాలి. మన సాధన ఎలా ఉండాలో ధృవుడిని చూస్తే తెలుస్తుంది. తన తండ్రి  ఉత్తానపాదుని తొడపైన కూర్చోనియ్యలేదనే కారణంగా తల్లి చెప్పగా తపస్సు చేయడానికి అడవికి వెళ్ళాడు. నాలుగేళ్ళ ప్రాయంవాడు.  నారదుడు ఆ పసివాడిని చూసి ఈ ఘోరారణ్యంలో ఉండతగదని,ఇంటికి మరలిపొమ్మని ఎంతగానో చెప్పిచూశాడు. ధృవుడు తన పట్టుదల వదలలేదు. “భేష్! ఇతడు సరి అయిన శిష్యుడు”అని సంతోషించి, “ఓం నమో భగవతే వాసుదేవాయ” అనే ద్వాదశాక్షరి మంత్రాన్ని ఉపదేశించాడు. కొన్నాళ్ళు ఆకులు అలములు తిని తపస్సు చేశాడు. కొన్నాళ్ళు ఒంటికాలిమీద నుంచుని తపస్సు చెశాడు. నిద్రాహారాలు మాని అతడు చేసిన తపస్సుకి లోకాలు కంపించిపోయాయి.  దేవతలు వెళ్ళి శ్రీమన్నారాయణమూర్తికి మొరపెట్టుకొన్నారు. అప్పుడు శ్రీమన్నారాయణమూర్తి ధృవుడికి ప్రత్యక్షమై వరం కోరుకోమంటే ధృవుడు ఆయన దివ్యసందర్శనం చూసి ముగ్ధుడై ఏదీ కోరలేకపోయాడు. శ్రీమన్నారాయణుడే ధృవుడికి అన్ని వరాలు ప్రసాదించాడు .ధృవతారగా శాశ్వతంగా నిలిచిపోయాడు. మన సాధన అలా ఉండాలి.

శ్రీకృష్ణుడిని దేవతలు అందరూ దర్శించారు. తారణహారుడు వచ్చాడని ఆనందించారు. కంసునికి భయం పట్టుకుంది. ప్రతి కదలికలో కృష్ణుడే. ఏ రూపంలో వచ్చి చంపుతాడో అని తీవ్ర ఆవేదనకు గురి అయ్యాడు.

# సమర్ధ సద్గురు నాధుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి)

- విజయేశ్వరానంద ప్రసాద్

అంతలో పూజ ముగించుకుని శ్రీ బాబు హాలులోకి వచ్చారు. పండితులు కుర్చీల్లో కూర్చొని ఉన్నారు.శ్రీ పరశురామయ్యగారు ఖాళీ చేసిన కుర్చీ ఖాళీగానే ఉంది. శ్రీ బాబు వారిని చూస్తూనే ఎంతో వినయ విధేయతలతో వంగి నమస్కరించారు. వారెవరూ లేవనూ లేదు, ప్రతి నమస్కారము చేయనూ లేదు. వారిలో ఒకాయన "కూర్చోండి" అన్నాడు. "తమ వంటి పెద్దల సమక్షంలో పిన్నవాడనైన నేను నిలబడటమే మర్యాదగా ఉంటుంది" అన్నారు శ్రీబాబు.



"కూర్చోండి" అని ఒకరిద్దరు మళ్ళీ అన్నారు. "తమ ఆజ్ఞ" అని మళ్ళీ వారికి నమస్కరించి, "అమ్మా! జననీ" అని అమ్మను స్మరించుకుని, శ్రీ బాబు కుర్చీలో కూర్చున్నారు. వాళ్ళంతా ఒకళ్ళనొకళ్ళు చూసుకుని ముసి ముసి నవ్వులు నవ్వుకున్నారు.

అప్పుడు ఒక పెద్ద ఎకసక్కెంగా "కూర్చోమని ఏదో మాటవరసకంటే మాత్రం, ఇంతమంది దిగ్గంతులమైన పండితుల ఎదుట, తగుదునమ్మా అని కూర్చున్నారే? వెనకటికి, కుక్షిలో అక్షరమ్ముక్కైనా లేని ఒక పక్షినివరో కూర్చోమంటే తగుదునమ్మా అని అది కుర్చీ ఎక్కి కూర్చున్నదట. సరే, 'కూర్చున్నారు కనుక మాతో వాదనచేసి మీ అర్హతను నిరూపించుకోండి. లేదా లేచి నిలబడండి" అన్నారు.

శ్రీ బాబు ఇసుమంతైనా నొచ్చుకొనక, పరమప్రశాంతులై, దరహాస వదనులై, మేఘ గంభీర స్వరంతో "అయ్యా! తమరి పెద్దరికమునుగూర్చి తమరే చాటుకొనవలసిన అవసరం తమకు కల్పించకుండా, నేనే ఆ పెద్దరికాన్ని మీకు కల్పించి, నమస్కరించి నిలబడ్డాను. కాని పదే పదే తమరు నన్ను కూర్చొనమని అనటంతో, పెద్దలమాటను శిరసావహించాలని తెలుపుతున్న మన భారతీయ సంప్రదాయాన్ని గౌరవించి కూర్చున్నాను. కాని మనస్సులో మరొక భావం పెట్టుకొని, మాటవరసకు మాత్రం కూర్చోమనటం, కూర్చున్న తరువాత లేవమనటం, ఏ సాంప్రదాయానికి చెందిన పెద్దరికమో నాకు

తెలియదు. ఏది ఏమైనప్పటికి, ఇప్పుడు నేను కూర్చున్నది జగజ్జనని ఒడిలోనే గాని, చెక్కకుర్చీలో కాదు. ఇక్కడ నుండి నేనులేచే ప్రశ్నే లేదు. ఈ కూర్చున్నదాన్ని విద్యాపీఠంగా మార్చి, నన్ను తన నిజపుత్రునిగా అనుగ్రహించే భారం అమ్మదే. కుక్షిలో అక్షరమ్ముక్క లేని పక్షినని నన్ను గురించి మీరన్నమాట నిజమోకాదో నాకు తెలియదుగాని, అక్షరస్వరూపుడైన పక్షివాహనుడు నా కుక్షిలోనే నెలకొని ఉన్నాడన్న విషయం మాత్రం నాకు నిత్యానుభూతిలో ఉన్న సత్యము. ఇక మీతో నన్ను వాదించమన్నారు. ఆ వాదమేదో పెద్దలు తమరే ప్రారంభించండి" అన్నారు. దానికి ఆ పెద్దలు "చిన్నవాడవు గనుక, ప్రశ్నించే అవకాశము నీకే ఇస్తున్నాము. ఏ శాస్త్రంలో అయినా సరే, నీ యిష్టము వచ్చిన ప్రశ్న అడుగు" అన్నారు. శ్రీబాబు "అన్ని శాస్త్రాలకు సారభూతమైనది జగన్మాత కృప ఒక్కటే. దానిని సర్వదా పరిపూర్ణంగా నేను అనుభవిస్తున్నాను. అందుచేత, నాకు సందేహాలు గాని అడగవలసిన ప్రశ్నలు గాని లేవు. అదేదో తమరే ప్రశ్నించండి" అన్నారు.

అప్పుడు వారిలో ఒక పెద్ద, "అయితే ఈ ప్రశ్నకు జవాబు చెప్పు, ఖండత్వం నుండి అఖండత్వం వచ్చిందా? లేక అఖండత్వం నుండి ఖండత్వం వచ్చిందా?" అని అడిగాడు. మిగతా వారు "చాలా చక్కని ప్రశ్న" అని ప్రశంసిస్తూ "ఈ ప్రశ్నతో ఈ కుర్రవాడి బండారం బయట పడక తప్పద"నుకున్నారు.

శ్రీబాబు కొద్ది క్షణాలపాటు కళ్ళు మూసుకొని జగన్మాతను స్మరించుకున్నారు. పిదప వారు కళ్ళు తెరచి వినమ్ర దరహాస వదనంతో "అయ్యా! తమరు చాలా చక్కని ప్రశ్న వేశారు. తమరేమో ఉద్దండ ప్రచండ మహాపండితులు. నేనా, శాస్త్ర వాసన అదే, 'విద్యాగంధం' లేని వాడిని. అదృష్ట వశం చేత జగజ్జనని అయిన నా తల్లి కృపకు పాత్రుడనై, కాలక్షేపం చేసుకుంటున్న వాణ్ణి. జనని నా నోటి నుండి ఎలా పలికిస్తే అలా పలకటం తప్ప నేను చేయగలిగింది ఏమీ లేదు. గనుక ఆ కరుణామయినే ప్రార్థించుకున్నాను. "వాళ్ళ ప్రశ్నకు జవాబు చెప్పే ముందు, ఆ ప్రశ్నపై తలెత్తిన నీ చిన్న సందేహాన్ని పెద్దలైన వారికి చెప్పి తీర్చుకోరా!" అని నన్ను ఆదేశించింది జగన్మాత. నా సందేహాన్ని మీ ముందు ఉంచుతున్నాను. తమరు ఖండత్వంలో ఉండి ఈ ప్రశ్న వేశారా?, లేక అఖండత్వంలో ఉండి వేశారా? దయచేసి వివరించండి."అన్నారు.

-సశేషం

# మౌన ధ్యాన శిబిరం

- రమణ ప్రసాద్

మనస్సును అదుపులో పెట్టుకోవాలి. దీనికి శ్రవణ, మనన, నిదిధ్యాసలు తోడ్పడతాయి. దేవదానవుల యుద్ధం అయిన తరువాత దేవతలు వరం కోరుకోమంటేఖట్వాంగ మహారాజు నాకు ఇంకా ఎంత ఆయుష్షు ఉందో చెప్పమంటాడు. వారు నీకు ఒక ముహుర్తకాలం మాత్రమే ఉంది అని చెప్పగా తన రాజ్యానికి వచ్చి మనుస్సని మాధవునిమీద నిలిపాడు. ఆయనకి ఆ క్షణంలో మాధవునిపై మనస్సు లయించింది. ముక్తిని పొందాడు. ఇప్పుడు మనం బృందావనంలో కూర్చుని ఉన్నాం. ప్రాణం పోతే ఏమిటట?

సాధనలో ఎల్లప్పుడూ ఇది గురుకృప అని గుర్తిస్తే తప్ప ముందుకు సాగలేము. గురుదేవులు మనకు అందించిన కీర్తన....

**మమకారములో పడకుమురా, మాధవుని తలపరా జీవా**
**భార్యాపుత్రుల బంధు మిత్రుల మమకారములు మాయలేరా**
**మరువకురా మాధవుని స్మరణము, మదలో సదా నిలుపరా।**

శబ్దాలలో పడి తికమక పడకండి. భార్య పుత్రులపైన ప్రేమ ఉండవచ్చు. కాని మమకారం ఉండకూడదు. మమకారం భగవంతుపై పెంచుకో. భగవంతుని దర్శనంకోసం ఆవేదన చెందేవాళ్ళకు భగవంతుడెప్పుడూ తోడునీడగా ఉంటాడు. బిడ్డ కడుపులో ఉన్నప్పుడు తల్లి పొందే అనుభూతి, బిడ్డ బయటకు వచ్చాక ఎంతవరకు ఉంటుంది? భగవంతుడు సర్వవ్యాపకంగా మన మనస్సల్లే ఉన్నాడు. చెవులతో వినటం, కంటితోచూడటం, మనస్సు వల్లే తెలుసుకో గలుగుతున్నాం. మనుస్స ఏ శక్తితో తెలుసుకోగలుగుతోందో అదే చైతన్యం. అదే సత్యం. చైతన్యం తప్పుకున్నప్పుడు ఈ చెవులు, కళ్ళు ఒట్టి గోళాలే. ప్రేతలోను చైతన్యం ఉంది. అది భగవంతుని స్వరూపమే. బూడిద ఐశ్వర్యం. దానిని మనం కృష్ణలోనో, గంగలోనో కలుపుతాం. భగవంతుని అనంతతత్త్వాన్ని మనమందరం పొందుతున్నాం. ఆయన ఉంటేనేమనం ఆ అనుభూతిని పొందుతున్నాం.

మదిలో సదా నిలుపరా - ఏమన్నారు మన గురుదేవులు?

మదిలో సదా నిలుపరా, మాధవుని తలపరా - అన్నారు.

భగవంతుడు ఇచ్చిన దేహంలో ఇన్నాళ్ళనుంచి ఉంటున్నాం. నన్ను గుర్తించు అని చెవిలో ఇల్లుకట్టుకుని చెపుతుంటే మనం వింటున్నామా? పప్పులో

ఉప్పు ఎక్కువైతే ఊరుకుంటామా? మహాత్ముల మాట వినకుండా దేహాన్ని ఆశ్రయించి అధోగతి పాలవుతున్నాం. ధర్మంగా, న్యాయంగా బతకలేకపోతున్నాం. మోసంచేస్తున్నది దేహం కాదు. మనస్సు. మనుస్సులో భగవంతుని ప్రతిష్టించుకో. నిష్ట నిలుపు నారాయణునిలో. సద్బుద్ధితో ప్రవర్తించు. మంచిని పెంచుకో. భగవదనుభూతిని పొందుతావు.

నేను జీవుడిని అనుకోవటం జీవుని లక్షణం. మనస్సుకు శాంతి లభించటం లేదు అంటారు. అది వాస్తవంకాదు. దాని మూలానికి వెళ్ళాలి. దానికి గురుకృప ఉండాలి. భగవంతుడు మనకు ఇచ్చిన గొప్ప 'గిఫ్ట్' సుషుప్తి.సుషుప్తిలో దేహభావన లేదు. జాగ్రదావస్థలో తెలుస్తోంది. జాగ్రదావస్థలో మహా జాగ్రదావస్థను పొందాలి.

ఆ మహానుభావుడు ఎందుకు పుట్టించినట్లు? ఎందుకు తరించమన్నట్లు?

ఖేలతి బ్రహ్మాండే భగవాన్, ఖేలతి పిండాండే

మనం బ్రహ్మాండంలో ఉన్నామా? పిండాండంలో ఉన్నామా? బ్రహ్మాండంలో ఉన్నాం. మనలో ప్రాణవాయువు ఉచ్ఛ్వాస నిశ్వాసలరూపంలో 'హంసస్సోహం' జపం జరుగుతోంది. దానినే అజప గాయత్రి జపం అంటారు. అహం సః - సోహం.

జాగ్రదావస్థలోకూడా దానియందు, ఆస్వాదన, అనురక్తి పొందితే ఎక్కడ కూర్చున్నా గుర్తుకు వస్తుంది. మనస్సు లేదు అక్కడ. కబీరు ఒక చెట్టు కింద కూర్చుని రొట్టె తినబోతుంటే, ఒక కుక్క ఆ రొట్టెను నోట కరుచుకు పోతుంది. రాముణ్ణే ఆ కుక్కలో దర్శించిన కబీరు " రామా! ఆరొట్టె గట్టిగా ఉంది. దానికి కొంచెం వెన్న రాయనియ్యి" అని కుక్క వెంట ముళ్లల్లోనుంచి, పొదలోలనుంచి పరిగెత్తి, శరీరం అంతా రక్తంతో , గాయాలతో ఆ కుక్కను సమీపిస్తే , రాముడే ఆయనను అనుగ్రహిస్తాడు. అది సహజ సమాధి స్థితి అంటే. 24 గంటలూ మనం ఉపాసన చేస్తున్న దానిని గుర్తిస్తూ ఉండటమే.

పరమాత్మోహం, పరిపూర్ణోహం బ్రహ్మైవేతి అహం బ్రహ్మేతి

మహాత్ముల దగ్గర భేద దృష్ట ఉండదు. భిన్నంగా ఏదైనా ఉంటే కదా. అది నువ్వు తెచ్చుకుంటున్నావు. అటువంటి అభేదమైన స్వరూపంలో మహాత్ములు ప్రకాశిస్తున్నారు. అందులో మనంకూడా ఉన్నాం. ఆ బ్రహ్మలీలలో, ఆ తత్త్వం, వింటూ, అనుకుంటూ,అంటూ, తత్త్వస్వరూపులమైపోవాలి. అటువంటి అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను, సాధనా సంపత్తిని శ్రీగురుదేవులు ప్రసాదించుగాక! సుఖీభవ! సుఖీభవ!

# సద్గురువే భగవంతుడు

-సుషుమ్న ప్రసాద

అప్పుడటి నుండి, మధురకవి శత్రుఘ్నుడు భరతుని సేవించినట్లు యెంతో శ్రద్ధ, విశ్వాసములతో తన గురుమూర్తిని సేవించాడు. నమ్మాళ్వారు చేసిన ప్రబోధములను తు.చ చప్పకుండా యెంతో శ్రద్ధతో లిఖించాడు. 20వేల పద్యములతో తమిళ భాషలో 'తిరువైమోజి'గా ప్రసిద్ధి చెందిన ప్రబంధమును చతుర్వేద సారముగ పరిగణిస్తారు.

నమ్మాళ్వారు నిష్క్రమణ తర్వాత, తిరువైమోజి సందేశముల నందజేసే బాధ్యత తాను స్వీకరించాడు. మధురకవి తన గురుదేవుని సందేశాలను వివిధ ప్రదేశములో ప్రచారము చేసి, అనేకమంది ప్రముఖమైన తమిళ పండితులు మహాకవులకు నిలయమైన తమిళ సంఘము మధురైకు విచ్చేసాడు.

తమిళ సంఘ సాహిత్య ప్రముఖులు 'తిరువైమోజి'ని సాహిత్యపరంగా గొప్ప విలువనీయ తగ్గ ప్రబంధము కాదని పందెం వేశారు. దానికి మధురకవి యెంతో ధీరత్వముతో ఆ ప్రబంధము యొక్క మహిమను ఋజువు చేయటానికి వారు యే పరీక్ష పెట్టినా, నిలబడటానికి తాను సిద్ధమైనాడు. ఆ కాలములో సాహిత్య ప్రక్రియ యొక్క విలువను ఋజువు చేయటానికి ఆ గ్రంధమును సంఘపాలకై (సంఘస్థానము)లో పెట్టి దేవాలయపు తటాకములో వదిలి పెట్టారు. ఆ క్రొత్త గంధము ఉదాత్తమైనది, సాహిత్య విలువలు కలదైతే, నీటి మీద తేలుతుంది. విలువైనది కానిచో, ఆ గ్రంధము నీటిలో మునిగి పోతుంది. వారి నిబంధనకు అనుకూలంగా మధురకవి ఆ ప్రబంధములోని ఒక తాళపత్రమును 'తిరువైమోజి' అని వ్రాసి సంఘపాలకై లో పెట్టాడు. యెంతో గంభీరముగా, గణనీయముగ నీటిపైకి తేలింది. పందెము వేసిన కవి పుంగవులు తటాకములో మునిగిపోయారు. కృపామయుడైన మధురకవి కరుణ వలన వారు రక్షింపబడ్డారు. ఆ సాహిత్య వేత్తలంతా తమ అజ్ఞానమునకు సిగ్గుపడి,మధురకవితో శిష్యులైన నమ్మాళ్వారును స్తుతించే మహాత్కార్యములో పాలుపంచుకొన్నారు.

మధురకవి నమ్మాల్వారు మహిమను ప్రచారము చేసే కార్యములో నిమగ్నమై, తన గురు చరణకమలములలో లయమైనాడు. గురుమూర్తికి, భగవంతునికి భేదము లేదని లోకమునకు నిరూపించాడు.

■

# అమెరికాలో మాతాజీ బోధ

(గత సంచిక తరువాయి)

-పరాశర ప్రసాద్

"సద్గురు మూర్తిని ఆశ్రయించిన సాధకుని మనస్సుని ఆవరించిన మలినాన్ని వదిలించి, నీ జీవితమనే వస్త్రానికి యోగ్యతను కలిగించే రజక పాత్రని వహిస్తారు. శిల్పి రాతిలో దాగి ఉన్న రూపాన్ని బయల్పరచటానికి అడ్డుగా ఉన్న వాటిని తొలగిస్తాడు కదా!

భగవానుడు పూజింపబడటానికి ఆయనలో మాలిన్యముగాని, నానాత్వముగాని ఉన్నాయా! మానవుడు తనలోని మాలిన్యమును, నానాత్వమును తొలగించుకో గలిగితే మాధవుడవుతాడు. దానిని పొందటానికిమన గురుదేవులు బ్రహ్మవిద్య లేక గురువిద్య అనే రాజమార్గాన్ని ప్రసాదించారు. సద్గురుమూర్తి అనుగ్రహం వలననే మన జీవితం నడుస్తోంది. మనం శ్వాశించగలుగుతున్నామంటే విషయాన్ని గ్రహించాలి.

మానవ జీవితంలో ఎత్తుపల్లాలు, సుఖదుఃఖాలు ఉంటాయి. వాటిని సహనంతో ఎదుర్కోవాలి. భగవంతుని విశ్వసించినవాడు సహనాన్ని ఎన్నడూ కోల్పోడు. 'జగమే నీదయ, సర్వము నీదయ, నీ దయ లేనిదే యేదియు లేదయా' అనే తత్త్వములో మునిగి తేలే భక్తునికి రాగద్వేషాలు, ఈర్ష్య అసూయలు ఉంటాయా?

జగతుల్తో ఉన్న ప్రతి సాధకుడు జాగ్రత్తగా ఉండాలి. పాపం పండితే భగవంతుడు అవతరించి వస్తాడు. అలాగే పుణ్యం ఫలించాలి కదా! పుణ్యం ఫలించాలంటే మనస్సు ఏకాగ్రత చెందాలి. మనస్సు ఏకాగ్రత చెందాలంటే మనస్సుని సద్గురుమూర్తికి అప్పగించాలి. అదే వైకుంఠము, అదే మోక్షము. అదే పుణ్యం ఫలించటమంటే.

భగవానుడు ఎక్కడ ఉన్నాడు? వైకుంఠం ఎక్కడ ఉంది? గజరాజు తన పరివారంతో కొలనుకు చేరాడు. గజరాజుకు నీరంటే ఎంతో ఇష్టం. తన తొండంతో ఆటలాడుతున్నాడు. తన సహచరులతో, ప్రియురాండ్రతో ఎంతసేపు ఆడుకున్నా తృప్తి లేదు. అంతేగా ప్రపంచంలో విషయాదులతో ఎంతకాలం కూడి ఉన్నా తృప్తి ఉంటుందా! గజరాజు ప్రాపంచిక మోహంలో పడి ఉన్న సమయంలో మొసలి, గజరాజు పాదాన్ని గట్టిగా పట్టుకుంది.

గజరాజు ఆ మొసలితో తన శక్తినంతా కూడగట్టుకుని పోరాడాడు. శక్తిహీనుడయ్యాడు. అంతవరకు ఎంతో ప్రేమ ఒలకపోసిన బంధు మిత్ర ప్రియురాండ్రులందరూ పలాయనం చిత్తగించారు. గజరాజు ఒంటివాడయ్యాడు.

తాను నిస్సహాయుడైనప్పుడు సంస్కారబలము చేత గజరాజుకు దైవము స్ఫురణకి వచ్చాడు. అదే జన్మ సంస్కారము. మనం ఆర్జించిన పుణ్యఫలము ఎన్నడూ వృధాకాదు. అది సమయం వచ్చినప్పుడు తప్పక మనకి సహాయ పడుతుంది. అందువలననే సత్సంగాలలో పాల్గొన్న సమయం నిత్యకాలంలో జమ అవుతుందని గురుదేవులు చెబుతూ ఉండేవారు.

గజరాజు ఎన్నో విధాల వైకుంఠనాధుని ప్రార్థించాడు. చివరికి నీవే తప్ప ఇతఃపరంబెరుగ అని సర్వసమర్పణ చేసుకున్న మరుక్షణం రక్షింపబడ్డాడు. ఈ ఉదంతం చాలదా మనం ఆశ్రయించిన గురుదేవుల అనుగ్రహాన్ని పొందటానికి" అన్నారు మాతాజీ.

-సశేషం

## శ్రద్ధాంజలి

పెదనిండ్రకొలను వాస్తవ్యులైన శ్రీసద్గురుదేవుల పరమ భక్తులు బండారు వీర్రాజుగారు 18-9-2011 ఆదివారం శ్రీసద్గురుసాయుజ్యం పొందారు. వీరి వయస్సు 80సంవత్సరములు. వీరికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు కలరు. వీరు నిండ్రకొలను శాఖలో తమ సేవలను అందించారు. సద్గురు దేవులు వీరి ఆత్మకు శాంతిని ప్రసాదించెదరు గాక! వీరి కుటుంబ సభ్యులకు, బంధు మిత్రులకు మా ప్రగాఢ సానుభూతిని తెలుపుతున్నాము.



# శ్యామసుందరా! ఒక్కసారి!
# ఒక్కసారంటే ఒక్కసారి తిరిగి కనిపించవూ!

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

"ఉద్ధవా!" ఏ ఘడియలో కృష్ణుడు మధురాగమనం చేశాడో ఆ క్షణమే కృష్ణుడు రాధ సమస్త అస్తిత్వంలో, రోమరోమాలలో వ్యాప్తుడైనాడు...! గోకుల కృష్ణుడు దర్శనీయుడు... ఈ అదృశ్య కృష్ణుడు ప్రతిక్షణంలో, ప్రతి స్థానంలో విరాజమానుడు." అంది రాధ. వెళ్ళేముందు కృష్ణుడు అన్నాడు........"

"ఏమన్నాడు రాధా?" ఉద్ధవుడు ఉత్కంఠతతో అడిగాడు.

"కృష్ణుడు అన్నాడు - రాధా! ఎంతవరకు ఈ క్షణం యొక్క అనుభూతిని పొందుతూ ఉంటావో, అంతవరకు నిన్ను కృష్ణునినుంచి ఎవ్వరూ వేరు చేయలేరు! మహాకాలుడు కూడా ఆ క్షణాన్ని స్మరణ చేసి ఆగిపోతాడు!" రాధ అంది. "ఈ ఆభూషణాలు, ఈ పుష్పమాలలు, ఈ చందనలేపనము, ఈ సుందరవస్త్రాలు...ఇవన్నీ కృష్ణునికి ప్రియమైనవి ఉద్ధవా! అత్యంత ప్రియమైనవి! ఆ క్షణంలో నేను జీవిస్తూ ఉన్నాను... ఆ క్షణంలోనే... శ్రీకృష్ణుని సమ్ముఖంలోనే... రాధ జీవిస్తూ ఉంది. చూడండి ఉద్ధవా... కృష్ణుడుఎవరిని త్యాగం చేశాడు? ఎవరైతే ఆయనకు వీడ్కోలు ఇచ్చారోవారిని!..." ఈ మాటలు అని రాధ ఉన్నట్లుండి పెద్దగా నవ్వింది. ఎంత పెద్దగా నవ్విందంటే ఆ నవ్వుకు ఉద్ధవుడు ఆశ్చర్యపోయాడు. రాధ కనులనుండి అంతులేని సాగరం ప్రవహించింది!"

ఎన్నినాళ్ళనుండో తనను వేధిస్తున్న రెండు ప్రశ్నలకు సమాధానం ఉద్ధవుడికి ఇప్పుడు దొరికింది...అంతిమ క్షణంలో రాధను కృష్ణుడు

ఎందుకు స్మరించాడో..."
ఇప్పుడు ఇక ఏ ప్రశ్నలేదు... ఏ సంకోచమూ లేదు.
హే ఉద్ధవా! ఏ సృష్టి శూన్యంలో ఆరంభమైందో, ఏ సృష్టి శూన్యంలో అంతమైందో... ఆ సృష్టిలో మనం దేనిని వెతుకుతున్నాం? ఆది అంతం శూన్యం అయితే మధ్యలో ఉన్నది శూన్యం కాకమరేమిటి? అలకనంద నుండి వేగంగా ప్రవహించే నీరు హిమాలయాలలో ప్రతిధ్వనిస్తూ.. కొండలను ఢీకొని... పెద్ద పెద్ద శిలలనుండి ప్రవహిస్తూ చేస్తున్న శబ్దంతో ఉద్ధవుడి చెవులు కృష్ణుడి స్వరాన్నే వింటున్నాయి. యాదవులను తీసికొని ప్రభాస క్షేత్రం వెళ్ళటానికి పూర్వ సంధ్యా సమయంలో కృష్ణుడు ఉద్ధవుని పిలిచి తీర్థయాత్రలకు వెళ్ళమని సూచించాడు... ఆ సన్నివేశం ఉద్ధవునికి ఇప్పుడు గుర్తుకు వచ్చింది.
ద్వారకకు కృష్ణుడు ఇక ఎన్నటికీ తిరిగి రాడు - అన్న విషయం ఉద్ధవుడికి అప్పుడే తట్టింది... ఆ ఘడియలో జరిగిన సంవాదం యొక్క ప్రతిధ్వని ఇప్పుడు కూడా అలకనందలో మారుమ్రోగి హిమాలయపు మంచు కొండలతో ఢీ కొంటున్నట్లుగా ఉంది... ఉద్ధవుడు దాన్ని వింటున్నాడు...
కృష్ణుని దేహత్యాగం గురించిన సందేశం రాధకు అందజేసి ఉద్ధవుడు హిమాలయాల వైపుగా నడిచాడు. పృథ్విలో ఏ స్థానమూ మిగలలేదు.... ఏ నామమూ మిగలలేదు. స్థానం, నామం ఏమిటి ఈ బ్రహ్మాండంలో పృథ్వి కూడా ఎక్కడ మిగిలి ఉంది? అంతా నిరాకారం - అనామం!... రాధ పూర్తిగా కృష్ణమయమైంది - ఏకాకారమైంది! ఆమెకు కృష్ణుని దేహత్యాగ సందేశం అర్థహీనం అయింది... ఉద్ధవుడు చకితుడైనాడు... ఇక ఒక్కొక్క క్షణము మహాకాలుని ప్రతిధ్వని లాగా ఉంది... ఈ స్మృతుల నుండి ఉద్ధవుడు వెనుదిరిగాడు...
హిమాలయాలలోని శీతలత్వాన్ని తీసుకొని ప్రవహిస్తున్న యమున, గంగ, మందాకిని నదుల జలాలలో స్నాన ధ్యానాలు ముగించుకొని ఉద్ధవుడు అలకనంద ఎదురుగా ఉన్న బదరీ ధామానికి చేరుకొన్నాడు. బదరీనాథ పవిత్ర ధామం ఎదురుగ తప్తకుండం వద్ద

నుంచొని ప్రకృతి యొక్క విశాలమైన వల్లెవాటును తిలకించాడు. కొంచెం దూరంలోనే వసుధార ప్రవాహము. ఎదురుగ ఉన్న పర్వతాలనుండి అవతరిస్తున్న ఋగ్వేదధార ఇంకా యజుర్వేదధారలు... మైళ్ళ కొద్దీ వ్యాపించి ఉన్న పచ్చటి వన ప్రదేశం! వీటిని స్పృశిస్తూ పవిత్ర ఏకాంత బోధ వినిపిస్తోంది.

"- శరీరాన్ని నిమిత్తంగ చేసికొని కర్మ చెయ్యి ఉద్ధవా! శరీరం పై మోహం వలదు. అలా అని శరీర త్యాగమూ చేయవద్దు... ఏకాంతంలో కూర్చుని విచారణ చేస్తే సత్యాన్ని తప్పక సాక్షత్కరించుకోగలుగుతావు...

- ఏ ఏకాంతాన్ని కృష్ణుడు సత్యానికి సాక్షిగా నిలుపుకొన్నాడో, ఇదేనా ఆ ఏకాంతత? ఇదేనా ఆ క్షణం? కృష్ణుడు తనతో చెప్పాడు. దాని ప్రతిఫలంగా ఈ క్షణంలో ఇంత తీవ్రత ఎందుకు వస్తోంది?... ఉద్ధవుడు గద్గదికుడైనాడు! కృష్ణుడి వాణి ఇక్కడ రూప రంగ సుగంధాలతో నినదిస్తోంది.

ఉద్ధవుడి కనులు పర్వతాలపై స్థిరమైనాయి.

మంచుతో కప్పబడిన శిఖరాలనుండి ఏదో ధ్వని వినవస్తోంది! కరుగుతున్న మంచులో ఎవరివో పద చిహ్నాలు కనపడ్డాయి.... ఈ పద చిహ్నాలు కృష్ణుడివా? లేక....

ఉద్ధవుడికి వసుదేవుడు జ్ఞప్తికి వచ్చాడు. దేవకిమాత స్మరణకు వచ్చింది.. రుక్మిణి సత్యభామలు...అర్జునుడు...అశ్వత్థామ...అక్రూరుడు, రాధ... వీరిలో హిమాలయాల భవ్య శిఖరాలలో ఎవరి పద చిహ్నాలు అంకితమై ఉన్నాయో!

-సశేషం

Printed, Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL